ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



గురువారం | 16-07- 2026 | సంపుటి: 17, సంచిక: 103, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులపై

## కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

**సీతారామ ప్రాజెక్టు ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్ తో చర్చించిన మంత్రి తుమ్మల**

**ప్రాజెక్ట్ సందర్శన దృష్ట్యా సమస్యలు పరిష్కరించాలని విజజప్తి చేసిన తుమ్మల**

హైదరాబాద్, జూలై 15 (ప్రజాకలం) : రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజజప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటంతో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ఈ న్యాయపరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సమన్వయంతో పనిచేస్తూ, కేంద్ర మంత్రులు, శాఖలు, అధికారుల వద్ద అన్ని విధాలుగా ప్రయత్నాలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభమై,

తరువాయి 2వ పేజీలో...

3 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతులు.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలే ప్రభుత్వ ప్రాధాన్యం

డేటా సెంటర్‌తో ఐటీ, ఏఐ, డిజిటల్ రంగాల్లో భారీ పెట్టుబడులు.. వేలాది ఉద్యోగాలకు మార్గం

ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందిస్తామని సీఎం హామీ



రంగారెడ్డి జిల్లా, జూలై 15 (ప్రజాకలం) : తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ అత్యాధునిక డేటా సెంటర్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి, ఈ ప్రాజెక్టు తెలంగాణ డిజిటల్ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతులు, పరిశ్రమలకు అనుకూల విధానాలతో తెలంగాణ పెట్టుబడిదారులకు మొదటి ఎంపికగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ ప్రమాణాలతో నిర్మితమవుతున్న ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధికి ప్రతీకగా నిలవబోతోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కాలుష్యరహిత,

తరువాయి 2వ పేజీలో...



పోరాట గడ్డల నుండి

## కదలివచ్చిన ఉద్యమకారులు

**నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ముఖాముఖి విజయవంతం**

హైదరాబాద్, జూలై 15 (ప్రజాకలం) : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) అధికారిక నిరంతరాయ షెడ్యూల్ ప్రకారం నేడు అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, మరియు ఆదిలాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శ్రీ మోతె శోభన్ రెడ్డి, శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు స్థాయిలో హాజరై, సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల సలహాలను, సూచనలను, నాటి ఉద్యమ ఆధారాలను స్వయంగా పరిశీలించారు.

తరువాయి 2వ పేజీలో...

ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్‌ను

# వెంటనే పునరుద్ధరించాలి

**కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, జూలై 15 (ప్రజాకలం) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు, సీసీఐ సాధన సమితి ప్రతినిధులతో కలిసి కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, 2019లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్‌ను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు.

తరువాయి 2వ పేజీలో...

## అటు పందులు... ఇటు కుక్కలు..!

**హడలెత్తుతున్న మెట్‌పల్లి పట్టణ ప్రజలు**

- వీధి జంతువుల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



4

ఈ నెల 20లోపు నిర్ణయం లేకుంటే

# నిరవధిక దీక్ష

**సింగరేణి మెడికల్ బోర్డుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి**

**డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కు.. నెలకు కచ్చితంగా మెడికల్ బోర్డు నిర్వహించాలి**

**పెండింగ్ దరఖాస్తులు పూర్తయ్యే వరకు నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాలి**

**సింగరేణి కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి : కల్వకుంట్ల కవిత**



బంజారాహిల్స్, జూలై 15 (ప్రజాకలం) : సింగరేణి కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక దీక్ష చేపడతానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సింగరేణి కార్మికులు తమ జీవితాన్ని బొగ్గు గనుల్లో అంకితం చేసి, శారీరకంగా దెబ్బతింటూ సమాజానికి సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి కార్మికులకు తమ కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగం ఇప్పించుకునే హక్కు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. సింగరేణిలో మెడికల్ బోర్డు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించకపోవడంతో వేలాది మంది కార్మిక కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని కవిత తెలిపారు. కనీసం నెలకు ఒక్కసారైనా మెడికల్ బోర్డు నిర్వహించడం తప్పనిసరి చేయాలని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలన్నీ పూర్తి అయ్యే వరకు నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**గురుకుల సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యానికి తావు లేదు**

**దూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రులతో మర్యాదగా వ్యవహరించి, సరైన మార్గదర్శనం చేయాలి**

**డీఎస్సీ భవన్‌లో TGSWREIS కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



హైదరాబాద్, జూలై 15 (ప్రజాకలం) : పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని డీఎస్సీ భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను ఓపికగా వింటూ వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లో సీట్లు కేటాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల రవాణా, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రికి వివరించారు. వారి సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ, పేద కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు వారికి అనుకూలమైన జిల్లాల్లో సీట్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్) శ్రీ సక్రు నాయక్కు మంత్రి పలు కీలక సూచనలు చేశారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం, విద్యార్థుల సంక్షేమం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని, ప్రతి అర్జీని నిబంధనల

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

అత్యాధునిక, సుస్థిర నగర నిర్మాణం జరుగుతోందని వివరించారు. గతంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వందకు పైగా దేశాల ప్రతినిధులు, వేలాది కార్పొరేట్ సంస్థలు హాజరుకావడం తెలంగాణపై ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఫార్చ్యూన్-500 సంస్థల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో రాష్ట్రం వాటా ఐదు శాతంగా ఉందని, దానిని 2047 నాటికి పది శాతానికి పెంచే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. ఈ లక్ష్య సాధనకు భారీ పెట్టుబడులు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యంతో కూడిన యువశక్తి, ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు అత్యంత కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి, అంతర్జాతీయ నిపుణుల సూచనలతో "తెలంగాణ-2047" అభివృద్ధి విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు, పారదర్శక భూ కేటాయింపులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను ప్రతి నెల స్వయంగా సమీక్షించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ఏర్పాటుతో తెలంగాణలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని, దీనివల్ల ఐటీ, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాఫ్ట్‌వేర్ సేవలు, అనుబంధ పరిశ్రమలు పెద్దఎత్తున రాష్ట్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు సృష్టించబడటంతో పాటు యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులు, ఈవీ వాహనాలకు ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు, కాలుష్య నియంత్రణ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఢిల్లీ తరహా కాలుష్యం, ముంబైలో ఎదురయ్యే వరదలు, బెంగళూరు ట్రాఫిక్ సమస్యలు హైదరాబాద్‌లో పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికతో నగరాభివృద్ధి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్ వెలుపల, రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న విస్తార ప్రాంతాన్ని భారీ తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. విద్యుత్, నీరు, రహదారులు, భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగవంతమైన అనుమతులతో ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షించి లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్ల అభివృద్ధి కోసం భూములు అందించిన రంగారెడ్డి జిల్లా రైతుల సహకారాన్ని ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు న్యాయమైన, మెరుగైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులను అభినందించిన ముఖ్యమంత్రి, ఈ సంస్థకు అవసరమైన అన్ని అనుమతులను అత్యంత వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిగా అమెజాన్ మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాలని కోరారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణను ప్రపంచ స్థాయి డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రత్యేక డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేసి, నిరంతర విద్యుత్, నీటి సరఫరా, రహదారులు, అత్యాధునిక కనెక్టివిటీతో కూడిన మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు విస్తరణతో పెరుగుతున్న డేటా ప్రాసెసింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణను దేశంలోనే అత్యాధునిక డిజిటల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం నియంత్రణ సంస్థగా కాకుండా సహాయకుడిగా వ్యవహరిస్తోందని, పెట్టుబడిదారులు ఆశించిన దానికంటే వేగంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులపై
# కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

మొదటి పేజీ తరువాయి...

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**దోమలవాగుపై నిల్వ సామర్థ్యం పెంపు ప్రతిపాదన**

సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్-1, పంప్‌హౌస్-2 మధ్య దోమల వాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చించినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిల్వ సామర్థ్యం పెరిగితే ఎత్తిపోతల పథకం మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, రెండు పంప్‌హౌస్‌ల మధ్య నీటి లభ్యత స్థిరంగా ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రతిపాదనకు నీటిపారుదల శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, కార్యరూపంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల వెల్లడించారు.

**ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటుపై చర్చ**

సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్-1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు అంశంపైనా విస్తృతంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో అధిక వరద ప్రవాహం ఏర్పడినప్పుడు కాలువకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు, నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఈ రెగ్యులేటర్లు ఎంతో దోహదపడతాయని వివరించారు. కాలువ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడం, అధిక ప్రవాహాన్ని నియంత్రించడం లక్ష్యంగా అవసరమైన సాంకేతిక పరిశీలనలు చేపట్టాలని అధికారులను ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించినట్లు వివరించారు.

**యాతలకుంట సొరంగం పనులు 2026 ఆగస్టు నాటికి పూర్తి**

సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2026 ఆగస్టు నాటికి లైనింగ్ పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సొరంగం పూర్తయితే సత్తుపల్లి ప్రాంత రైతాంగానికి సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సొరంగం నిర్మాణ బిల్లుల చెల్లింపులను త్వరగా విడుదల చేస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగితే నిర్మాణ సంస్థలు మరింత వేగంగా పనులు కొనసాగించే వీలుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**భూసేకరణ పరిహారం, పైప్ ఇరిగేషన్‌పై సూచనలు**

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహార చెల్లింపులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం అందితే బాధిత రైతులకు ఊరట లభించడంతోపాటు ప్రాజెక్టు పనులు కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందుకు సాగుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అత్యధిక భూములు ఆయిల్‌పామ్ సాగులో ఉన్నందున, సంప్రదాయ డిస్ట్రిబ్యూటరీ కాలువలకు బదులు పైపుల ద్వారా సాగునీటి పంపిణీ (పైప్ ఇరిగేషన్ నెట్‌వర్క్) సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ తోటలకు నిరంతరం, నియంత్రిత పద్ధతిలో నీరు అందించేందుకు పైప్ ఇరిగేషన్ విధానం మరింత అనుకూలంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు అత్యవసరంగా సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**జూలూరుపాడు సొరంగం పునఃప్రారంభానికి చర్యలు**

సీతారామ ప్రధాన కాలువపై జూలూరుపాడు సొరంగం నిర్మాణం వివిధ కారణాలతో నిలిచిపోయిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పనులను ప్రాధాన్యతతో పునఃప్రారంభించి, పాలేరు జలాశయానికి వీలైనంత త్వరగా నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని కోరగా, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. పాలేరు జలాశయానికి నీరు చేరితే ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరతాయని మంత్రి పేర్కొన్నారు. మొత్తంమీద, సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను సమన్వయంతో పరిష్కరించుకుని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఇరువురు మంత్రులు ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు.

# పోరాట గడ్డల నుండి కదలివచ్చిన ఉద్యమకారులు

మొదటి పేజీ తరువాయి...

స్వరాష్ట్ర సాధనలో సరిహద్దు జిల్లాలది "కీలక పాత్ర"

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులు స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. నాడు వివక్షకు వ్యతిరేకంగా అడవి బిడ్డల నుండి మొదలుకొని పట్టణ శ్రేణుల వరకు, విద్యార్థి లోకం, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు సరిహద్దు జిల్లాల్లో రహదారులను స్తంభింపజేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారని, ఆనాటి పోరాట పటిమే నేటి స్వరాష్ట్ర ఆవిర్భావానికి బలమైన పునాది అని ప్యానల్ స్పష్టం చేసింది.

ఉద్యమకారులు సమర్పించిన ప్రధాన సంక్షేమ వినతులు:నేటి ముఖాముఖి సంప్రదింపుల్లో నాలుగు జిల్లాల ప్రతినిధులు, క్షేత్రస్థాయి యోధులు తమ భవిష్యత్తుకు రక్షణ కల్పించాలని కోరుతూ కమిటీ ముందు తమ ప్రధాన సంక్షేమ డిమాండ్లను ఉంచారు:

250 గజాల నివాస స్థలం: సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి నివాస అవసరాల నిమిత్తం 250 గజాల భూమిని ఉచితంగా కేటాయించి రిజిస్ట్రేషన్ చేయించాలి.

గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్: వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించడానికి గౌరవప్రదమైన నెలవారీ జీవితకాల పెన్షన్ అందించాలి.

తదుపరి తరానికి రిజర్వేషన్లు: నాటి పోరాటంలో చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన ఉద్యమకారుల పిల్లలకు విద్యా సంస్థల అడ్మిషన్లలో మరియు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా కల్పించాలి.

మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు: ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మహిళా పోరాట యోధులకు ప్రత్యేక స్వయం ఉపాధి పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

ఉచిత కార్పొరేట్ వైద్య సేవలు: అన్ని ప్రభుత్వ మరియు గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు పొందేందుకు వీలుగా ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలి.

ఉచిత నాణ్యమైన విద్య: గుర్తింపు పొందిన ఉద్యమకారుల పిల్లలకు లేదా వారి తదుపరి తరానికి కేజీ నుండి పీజీ వరకు పూర్తి ఉచిత విద్యను అందించాలి.

ఉచిత రవాణా సౌకర్యం: వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీబస్సులలో జీవితకాల ఉచిత ప్రయాణ రవాణా పాస్ సౌకర్యం కల్పించాలి.

కమిటీ సభ్యుల హామీ:

సమావేశ ముగింపులో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మాట్లాడుతూ.. "ఉత్తర తెలంగాణ పోరాట గడ్డల నుండి వచ్చిన ప్రతి ఒక్కరి ఆవేదనను, డిమాండ్లను కమిటీ సానుకూలంగా రికార్డ్ చేసింది. ఈ సంక్షేమ అంశాలు ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదు.. మీ రక్తం, చెమట చిందించి సాధించుకున్న మీ ఆత్మగౌరవ హక్కు! సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా జరుగుతున్న పూర్తి స్థాయి డిజిటల్ రికార్డింగ్ సాక్షిగా, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా చూస్తాం" అని గట్టి భరోసా ఇచ్చారు.

# ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలి

మొదటి పేజీ తరువాయి...

దేశానికి ఉపయోగపడే ప్రభుత్వ రంగ సంస్థను స్క్రాప్‌గా మార్చకుండా, తిరిగి ఉత్పత్తి ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ మాదిరిగానే ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్‌కు కూడా ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్లాంట్ పునరుద్ధరణతో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించడంతో పాటు ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని తెలిపారు.

ఆదిలాబాద్ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన సీసీఐ పునరుద్ధరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కేటీఆర్ కోరారు. సీసీఐ ప్లాంట్ పునరుద్ధరణ జరిగే వరకు బీఆర్ఎస్ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రైతులు, కార్మికులు, ప్రజల ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని అన్ని వేదికలపై ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే మారుమూల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులు, సంరక్షకులు, బంధువులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వారికి స్పష్టమైన సమాచారం అందిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యా అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో నిధులు కేటాయించి గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న సమయంలో, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం లేదా అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రతి అధికారి తన బాధ్యతగా భావించి పనిచేయాలని, ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆ లక్ష్యాల సాధనలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. గురుకులాల్లో ప్రవేశాల కోసం వచ్చిన తల్లిదండ్రులు తమ సమస్యలను స్వయంగా విని వెంటనే స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు మంత్రి చూపుతున్న చొరవను వారు అభినందించారు. చివరగా మంత్రి. అడ్లూరి మాట్లాడుతూ..., "పేద విద్యార్థి చదువు ఆగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా అవసరమైన ప్రతి సహాయాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు కూడా అదే నిబద్ధతతో పనిచేయాలి" అని స్పష్టం చేశారు.

# ఈ నెల 20లోపు నిర్ణయం లేకుంటే నిరవధిక దీక్ష

మొదటి పేజీ తరువాయి...

అనంతరం ప్రతి నెలా కచ్చితంగా ఒకసారి మెడికల్ బోర్డు సమావేశం జరిగేలా ప్రభుత్వం శాశ్వత విధానం రూపొందించాలని సూచించారు. రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్న సింగరేణి కార్మికులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, వారు డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న తేదీనే ప్రామాణికంగా తీసుకునేలా పోరాటం చేస్తామని కవిత భరోసా ఇచ్చారు. డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కు అని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం సింగరేణిలో గెలిచిన కార్మిక సంఘాలు డిపెండెంట్ ఉద్యోగాల అంశాన్ని పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. తాము చేపట్టిన "బాయిబాట" కార్యక్రమం తర్వాత అన్ని రాజకీయ పార్టీల నాయకులు సింగరేణి ప్రాంతాలకు వస్తున్నప్పటికీ, మెడికల్ బోర్డు నిర్వహణపై మాత్రం ఎవరూ గట్టిగా మాట్లాడటం లేదని ఆరోపించారు. తాము చేసిన ఉద్యమం వల్లే ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చిందని పేర్కొన్నారు.

ప్రభుత్వం మెడికల్ బోర్డు నిర్వహణపై కేవలం లీకులు ఇస్తోందని, ఒక్కసారి బోర్డు నిర్వహించి సమస్యను ముగించాలనే ప్రయత్నం చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్మికులు కోరుకున్న విధంగా అన్‌ఫిట్‌గా ప్రకటించే ఉద్దేశంతోనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, ఫిట్‌గా ప్రకటించి అవినీతికి, డబ్బుల వసూళ్లకు వేదికగా మార్చకూడదని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ నెల 20లోపు మెడికల్ బోర్డుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే నిరవధిక దీక్ష ప్రారంభిస్తానని మరోసారి స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామని తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ, తాడిచర్ల బొగ్గు గని కేటాయింపును మాత్రమే గొప్పగా చెప్పుకోవడం సరిపోదని, ఇంకా పెండింగ్‌లో ఉన్న 17 బొగ్గు గనులను కూడా బేషరతుగా సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోల్ ఇండియాలో అమలవుతున్న మంచి విధానాలను సింగరేణిలో కూడా అమలు చేయించే బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్రం ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. వేజ్ బోర్డు అమలు, కార్మికుల పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపన్ను తొలగింపు వంటి అంశాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా తక్షణ చర్యలు చేపట్టాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

# పారిశ్రామిక ,సాగునీటి, వ్యవసాయ రంగాలలో మౌలిక వసతులు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జూలై 15 : రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లి సమీపంలోని అమరరాజా గిగా కారిడార్ ప్రాజెక్టులో భాగంగా అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్‌లో నూతనంగా నిర్మించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్‌ను ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరరాజా సంస్థ దాదాపు నాలుగు దశాబ్దాల విజయవంతమైన ప్రయాణం అనంతరం తన తొలి భారీ పెట్టుబడిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానంపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.అమరరాజా ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల కంపెనీలతో పోటీపడుతున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో ఎదగాలంటే అమరరాజా వంటి సాంకేతిక సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కీలకమని, వాటికి అవసరమైన అత్యాధునిక ఈవీ బ్యాటరీల తయారీలో తెలంగాణ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో 32 గిగావాట్ గంటల సామర్థ్యంతో అమరరాజా కంపెనీలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ పరిశ్రమ ద్వారా 700 మంది ఇక్కడ మహబూబ్నగర్ జిల్లా వారికి ఉపాధి లభిస్తుండగా, వారిలో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. అమర రాజా స్థాపించిన ఈ పరిశ్రమతో పాలమూరు జిల్లా రూపు రేఖలు మారుతాయని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను మరింత బలోపేతం చేస్తూ పారదర్శక పాలన, అత్యుత్తమ మౌలిక వసతులు, పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. పారిశ్రామిక, పర్యాటక, క్రీడా రంగాలకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తూ 2047 నాటికి దేశ అభివృద్ధిలో తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్ది కీలక శక్తిగా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశ జనాభాలో తెలంగాణ కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 10 శాతం వాటా సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నదని చెప్పారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలను పారిశ్రామిక, సేవారంగ, వ్యవసాయ ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి తయారీ పరిశ్రమలను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

ఒకప్పుడు మహబూబ్నగర్ జిల్లాను దత్తత తీసుకునే స్థాయి నుండి, ప్రస్తుతం మనమే ఇతర జిల్లాలను దత్తత తీసుకునే స్థాయికి వచ్చామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటుచేసి బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

పాలమూరు- రంగారెడ్డికి సంబంధించి 90 టీఎంసీల నీటి కేటాయింపుకై కేంద్ర ప్రభుత్వం తో పాటు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి అవసరమైన నీటి కేటాయింపులు, అనుమతులు సాధించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే పాలమూరు రైతులకు శుభవార్త అందిస్తామని తెలిపారు.మహబూబ్నగర్ జిల్లాలో




కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, రాజోలిబండ (ఆర్‌డీఎస్) వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా అమర్ రాజా కంపెనీ 32 గిగావాట్ల ప్లాంటును ప్రారంభించుకోవడం ఒక నిదర్శనమని అన్నారు .2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించే లక్ష్యంగా ఎనర్జీ లక్ష్యాన్ని చేపట్టడం జరిగిందని, విద్యుత్ పరిశ్రమలే కాకుండా, ఎనర్జీ పరిశ్రమలు తీసుకురానున్నమని, క్లీన్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. 2031 నాటికి ఈవి బ్యాటరీల వినియోగం నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రతి ఒక్కరు గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తున్నారని, బ్యాటరీ తయారీలో తెలంగాణ అద్భుతంగా ఉందని ,2023లో 6.8%గా ఉన్న పరిశ్రమల అభివృద్ధి 2026 నాటికి 8.1% చేరుకున్నామని, 2034 నాటికి 13% చేరుకునేలా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీ.కే అరుణ మాట్లాడుతూ అమర రాజా వంటి కంపెనీ మహబూబ్నగర్ ప్రాంతంలో ఉండడం ఈ ప్రాంతాలవాసుల అదృష్టం అని అన్నారు. ప్రస్తుతం మనం విదేశాల నుండి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నామని, మన డబ్బు విదేశాలకు పోకుండా మనమే అభివృద్ధి చేసుకునేలా ప్రధాన మంత్రి ఆలోచిస్తున్నారని తెలిపారు. మహబూబ్నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివిటిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన అమర రాజా కంపెనీ గిగా మ్యానుఫ్యాక్చరింగ్ కారిడార్ గా రూపకల్పన కాబోతున్నదని, ఇది దేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉపయోగపడే ఫ్యాక్టరీ కాబోతున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా అన్ని పట్టణాలలో ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తున్నామని, రాబోయే రోజుల్లో 30 వేల ఎకరాలలో అనేక కంపెనీలు రానున్నాయని తెలిపారు.అమర రాజా కంపెనీ సీఎండీ గల్లా జయదేవ్, విక్రమాదిత్య లు మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ ,యువజన క్రీడల సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,ఎస్పీ జానకి, తదితరులు ఉన్నారు.

# మెట్‌పల్లి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో అల్పాహారం నాణ్యత పరిశీలన

**– విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన జువ్వాడి నర్సింగరావు, మైలారపు లింబాద్రి**



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 15 (ప్రజా కలం)

పట్టణంలోని అరపేట వద్ద ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల హాస్టల్‌ను రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి బుధవారం ఉదయం సందర్శించారు. ఉదయపు అల్పాహార సమయంలో హాస్టల్‌కు చేరుకున్న వారు విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి, దాని నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో కూర్చొని వారితో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతులు, విద్యాబోధన, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై వారితో ముచ్చటించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల నరేశ్, పందిరి రమేశ్, నూనుగొండ నరేశ్, గుడికందుల అజయ్, మసుల ప్రవీణ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పన్నాల మాధవ రెడ్డి, స్థానిక వార్డు ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మిత్రుడు అశోక్ కుటుంబానికి 63 వేల ఆర్థిక సహాయం అందజేత

**10వ తరగతి 1995-96 బ్యాచ్ మిత్ర బృందం కలిసి ఆర్థిక సహాయం**



ఎండపల్లి, జూలై 15 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామా నికి చెందిన కోమటిపల్లి అశోక్ మిత్రుడు 10వ తరగతి బ్యాచ్ 1995–96 మిత్రబృందానికి చెందిన మిత్రుడు అశోక్ మృతి చెందడం తమను తీవ్రంగా కలచివేసిందని మిత్ర బృందం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మిత్రబృందం తరపున అశోక్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మిత్ర సభ్యులు అందరూ కలిసి 63.000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కష్టకాలం లో కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ బ్రహ్మానందం, బి రవీందర్, ఎస్ సంతోష్ కుమార్, టి రాజేశం, ఎండి రఫీక్, కదారి గంగాధర్, ఏం కౌశిక్ కుమార్, సీహెచ్ రాజమౌళి, పి రవీందర్, జి నగేష్ పాల్గొని అశోక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

# పాత కరెంట్ బిల్లుల భారం మోపవద్దు

**- కలెక్టర్‌కు సర్పంచుల వినతి**



మెట్ పల్లి రూరల్, జూలై 15(ప్రజా కలం): గ్రామ పంచాయతీలపై పాత విద్యుత్ బకాయిల భారం వేయవద్దని కోరుతూ సర్పంచుల సంఘం ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. పాత విద్యుత్ బకాయిల్లో 15 శాతం తక్షణమే చెల్లించాలని పంచాయతీలపై ఒత్తిడి తేవడాన్ని సర్పంచులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం ఒక్కో చిన్న గ్రామ పంచాయతీకి ?10 లక్షల నుండి, పెద్ద గ్రామ పంచాయతీలకు ?50 లక్షల వరకు విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని కలెక్టర్‌కు వివరించారు. ఇంత భారీ మొత్తంలో బకాయిలు చెల్లించడం పంచాయతీల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇకపై వచ్చే ప్రతి నెల కరెంట్ బిల్లును క్రమం తప్పకుండా చెల్లిస్తామని సర్పంచులు హామీ ఇచ్చారు. గతంలో పేరుకుపోయిన పాత విద్యుత్ బకాయిలను ప్రభుత్వం భరించాలని లేదా వాటిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచుల ఆవేదనను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పాత బకాయిల అంశాన్ని ప్రభుత్వం వద్దే తేల్చేలా నివేదిక పంపుతామని సర్పంచులకు హామీ ఇచ్చారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు

# ప్రజలు సహకరించాలి

**- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 15 (ప్రజా కలం)

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్నారని, ఇప్పటివరకు జిల్లాలో సుమారు 60 శాతం ఫారాలు సేకరించినట్లు వెల్లడించారు. మిగిలిన ఫారాలను ఈ నెల 24వ తేదీలోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలు లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బీఎల్ఓలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించని వారు, వేరే ప్రాంతాలకు మారిన వారు లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్న వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను నమోదు చేయాలని సూచించారు. వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే



ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా స్పందించకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి అర్హ ఓటరు జూలై 24వ తేదీలోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో ఇంటింటికీ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మెట్‌పల్లి, కోరుట్ల తహసీల్దార్లు నీత, చైతన్య, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి జులై 15 (ప్రజాకలం)

జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్జెక్టుల వారీ వృత్త్యంతర శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని జ్ఞాన హైస్కూల్‌లో ఆంగ్ల సబ్జెక్టుకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్, శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. రిసోర్స్ పర్సన్ బోధనను తరగతి గదిలో కూర్చొని ప్రత్యక్షంగా వీక్షించి, ముఖ్యంగా కృత్రిమ మేధ ఏఐని తరగతి గదిలో విద్యార్థుల అభ్యాసానికి ఎలా సమర్థవంతంగా వినియోగించాలనే అంశంపై అందిస్తున్న శిక్షణను ఆసక్తిగా పరిశీలించారు. ఆంగ్ల భాష బోధనలో స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థి–కేంద్రిత బోధనా విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కృత్రిమ మేధ ఆధారిత బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలి: కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించడంలో ఆధునిక బోధనా విధానాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణా అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూలై 31లోగా నవోదయ

# ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయాలి

**నవంబర్ 28న -2027 పరీక్ష - అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

జగిత్యాల ప్రతినిధి జూలై 15 (ప్రజాకలం)

జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027–28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ 2027 కు జిల్లాలోని అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు జూలై 31, 2026 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 31 చివరి తేదీ కాగా, ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అర్హ విద్యార్థికి పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి, అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు అర్హులైన ప్రతి విద్యార్థికి సమాచారం అందించడంతో పాటు, తల్లిదండ్రులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన



సహాయం అందించాలని సూచించారు. అలాగే మండలాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పంచాయతీ శాఖ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. నాణ్యమైన, ఉచిత వసతి విద్యను అందించే జవహర్ నవోదయ విద్యాలయాల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు జూలై 31లోగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

**ఆర్థిక స్వావలంబనతో భవిశ్యత్తుకు భరోసా - వి.హెచ్.పి క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం**

పెద్దపల్లి,జూలై15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) సంస్కారవంతమైన కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర అని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటనమంత్రి గుమ్మల సత్యం అభిప్రాయం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, విశ్వహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడునెలల కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న 35మంది మహిళలకు ప్రశంసాపత్రాలు బుధవారం అందించారు. గాయత్రి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గుమ్మల సత్యం మాట్లాడుతూ అత్యంత ప్రాచీన వైభవోపేతమైన చరిత్ర కలిగిన హిందూధర్మంపై విదేశీ భావజాలం కలిగిన కొంతమంది వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా కుట్రలు పన్నుతున్నారని, అలాంటి వారిపట్ల హిందువులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందుకే మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించి వారిని సైతం ఆదర్శవంతమైన కుటుంబ నిర్మాణంలో కార్యోన్ముఖులను చేయడంలో భాగంగానే కుట్టుశిక్షణ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పెద్దపల్లి మహిళాలోకం సద్వినియోగం



చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ రాజేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్రనేత నల్లా మనోహరరెడ్డి, జిల్లాకార్యదర్శి నాగులమల్యాల సత్యం, జిల్లా సహకారదర్శి రాజు, ఉపాధ్యక్షురాలు మమత, బొమ్మకంటి రవి, జుంజుపల్లి దిలీప్, బజరంగదళ్ జిల్లా కన్వీనర్ మణిదీప్, నాయకులు చందు, రాజు, సతీష్, శిక్షకురాలు విజయలక్ష్మి, వందమంది మహిళలు, తదితరులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

**– 721 దరఖాస్తుల పరిశీలనకు షెడ్యూల్ విడుదల**

**– సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాకుంటే అనర్హులే**

పెద్దపల్లి,జూలై15:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా రామగుండం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా, సర్టిఫికెట్ల పరిశీలన తేదీలను ఖరారు చేస్తూ రామగుండం శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ



నియామక ప్రక్రియ కోసం మొత్తం 721 దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని జూలై 16 నుండి జూలై 20 వరకు గోదావరిఖని,విఠల్ నగర్,వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న క్వార్టర్ నెంబర్ ఎ–5లోని శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ షెడ్యూలు ప్రకారం వేమునూర్ అభ్యర్థులకు జూలై 16న,కుందన్నపల్లి అభ్యర్థులకు జూలై 17,18న,ఎల్కలపల్లి–శ్రీశ్రీశ్రీ అభ్యర్థులకు జూలై 19న,ఎల్కలపల్లి–× అభ్యర్థులకు జూలై 20న పరిశీలన జరుగుతుందని, దరఖాస్తుదారులు తమ విద్యార్హత,కులం, నివాసం,వయస్సు సంబంధిత ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను వెంట ఉంచుకుని నిర్ణీత తేదీలలో తప్పనిసరిగా హాజరు కావాలని, ఒకవేళ హాజరు కాని పక్షంలో అటువంటి అభ్యర్థులను నియామక ప్రక్రియలో అనర్హులుగా పరిగణిస్తామని,ఆ తర్వాత ఎటువంటి అవకాశం కల్పించబడదని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

**- ఓదెల మండల ఉద్యానవన శాఖాధికారి బి.రాము**



పెద్దపల్లి,జూలై15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రస్తుత వానాకాలం సీజన్‌లో'ఎల్‌నినో' ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల ఉద్యానవన విస్తరణ అధికారి బి. రాము సూచించారు. ఓదెల మండలంలోని కనగర్తి,ఓదెల,మడక, పొత్కపల్లి గ్రామాల్లోని తీగ జాతి కూరగాయల తోటలను బుధవారం ఆయన పరిశీలించి,సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మండల ఉద్యానవన విస్తరణ అధికారి బి.రాము మాట్లాడుతూప్రస్తుత వానాకాలం 2026 సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు ఆలస్యంగా కురవడం,మధ్యలో సుదీర్ఘ వర్షాభావం మరియు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సాగులో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ వాతావరణ పరిస్థితుల వల్ల ప్రాజెక్టులు,చెరువులు నిండకపోవడమే కాకుండా భూగర్భ జలాలు తగ్గి బావులు,బోర్లలో నీటి లభ్యత గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉన్నందున, రైతులు తమ వద్ద ఉన్న నీటిని అంచనా వేసుకుని మాత్రమే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరి సాగును పరిమిత విస్తీర్ణంలో చేపట్టి స్వల్పకాలిక రకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే కూరగాయలు,ఆకుకూరలు వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని ఆయన కోరారు. నేలలో 60–75 మిల్లీమీటర్ల తేమ ఉండేలా సమృద్ధిగా వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు వేయాలని,బిందు లేదా తుంపర సేద్యం పద్ధతులను పాటిస్తూ ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం బావుల్లో నీరు ఉందని భావించి అధిక విస్తీర్ణంలో సాగుకు పూనుకోవద్దని సూచిస్తూ,కూరగాయల సాగులో మల్చింగ్ పద్ధతిని పాటించడం వల్ల ప్రయోజనం ఉంటుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పనాస అశోక్,బోడకుంట్ల అనిల్,రాజుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఆరోగ్య, విద్యా పై అవగాహన సదస్సు



గొల్లపల్లి జూలై 15 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో విద్యార్థినుల ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి దాదాపు రెండు గంటల పాటు విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడారు. చదువులో రాణించడానికి ఒత్తిడిని ఎలా జయించాలి, జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి, కౌమార దశలో ఎదురయ్యే శారీరక మార్పులు–ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు వివరించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పోషకాహారం తీసుకుంటూ లక్ష్యాల వైపు ఎలా అడుగులు వేయాలో దిశానిర్దేశం చేస్తూ విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థి దశలో చదువు ఎంత ముఖ్యమో, శారీరక, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని, ఈ రెండూ సమపాళ్లలో ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మెన కుమార్ మాట్లాడుతూ.. "వీ సర్వ్" (సేవే పరమావధి) అనే ఏకైక నినాదంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పనిచేస్తోందని గుర్తుచేశారు. సమాజానికి సేవ చేయడంలో, ముఖ్యంగా మన రేపటి పౌరులైన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఎల్లప్పుడూ ముందుంటుందని ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు తమ క్లబ్ తరపున నిరంతరం తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించిన కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ , ఇంచార్జి ప్రిన్సిపల్ భానుప్రియ, శైలజ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మహంకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్, మాజీ అధ్యక్షుడు ముసుకు కరుణాకర్ రెడ్డి, మాజీ కార్యదర్శి సాయిని నరహరి, ఇతర క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
గురువారం, జూలై 16, 2026

# యుద్ధంలో సమిధలవుతున్న సామాన్యులు

పశ్చిమాసియాలో నెలకొన్న శాంతియుత పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారిపోయాయి. ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురు దాడులకు దిగింది. యుద్ధం మూలంగా కేవలం ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికానే కాకుండా సమీపంలోని లెబనాన్,గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టం కలిగించింది. అటు ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించింది. యుద్ధం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు కొరత ఏర్పడి పలు దేశాలు లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. యుద్ధం మూలంగా కేవలం ఆస్తి, ఆర్థిక నష్టమే కాదు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా ఇరాన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ముక్కుపచ్చలారని చిన్నారులు ఎందరో ఉన్నారు. ఎన్నో వందల మంది గాయాలపాలయ్యారు. పరస్పర దాడుల్లో ఆ రెండు దేశాలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న విషయాన్ని పక్కనపెడితే?ఇరాన్ దాడుల్లో భారత్ కు చెందిన ఓ వాణిజ్య నౌక ధ్వంసం కాగా? అందులోని ఓ భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన హార్మూజ్ జలసంధికి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది.రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆ దేశాలకు చెందిన ఆస్తి, ప్రాణ నష్టాలు సర్వసాధారణమే అయినప్పటికీ? ఆ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు.. అది కూడా అలీన ఉద్యమంతో ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్న భారత్ లాంటి దేశాలకు నష్టం వాటిల్లుతుండటం గమనార్హం. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భారత్ ఏ ఒక్క దేశానికి మద్దతు పలక లేదు. అదే సమయంలో ఇరు దేశాలు చర్చించుకుని ప్రపంచ శాంతికి పాలుపడాలని భారత్ ఆకాంక్షిస్తున్న సంగతీ తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ దాడిలో భారత నౌక ధ్వంసం కావడం, అందులోని ఓ భారతీయుడు గల్లంతు కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలపై తాజాగా జరుగుతున్న పోరాటం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక ఈ రెండు దేశాల మధ్య శాంత కల్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిపిన రెండు దాడుల కన్నా తీవ్రంగా ఆదివారం ఇరాన్‌లోని 140కు పైగా క్షిపణి, డ్రోన్ కేంద్రాలు, ఆయుధాగారాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ప్రాంతాలపై లక్షిత దాడులు చేసినట్టు అమెరికా ప్రకటించింది. 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అది మూల్యం చెల్లిస్తున్నది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టారు. తాము మాత్రమే హ్వార్ముజ్ జలసంధిని నియంత్రించగలమని, దాని ద్వారా పయనించే నౌకలపై చార్జీలు విధించగలమని ఇరాన్ స్పష్టం చేసింది. ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ బాఘెర్ ఘాలిబాఫ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, ఇరాన్ క్షిపణులను తాము సమర్థంగా అడ్డుకున్నట్టు ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా క్షిపణి శకలాలు పడి ఒక పిల్లవాడు సహా ముగ్గురు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తాము కూడా అడ్డుకున్నట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. ఆదివారం బహ్రెయిన్‌లో పౌరులకు మూడుసార్లు హెచ్చరిక సైరన్లు మోగాయి.సైప్రస్ జెండాతో భారత్ బయలుదేరిన జీఎఫ్ఎన్ గెలాక్సీ నౌకపై ఓమన్ తీరం సమీపంలో హార్మూజ్ జల సంధికి చేరుకున్న సమయంలో ఇరాన్ నుంచి దూసుకువచ్చిన బాంబు పడింది. దీంతో గెలాక్సీ నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నౌకలో మంటలు చెలరేగిన సమయంలో అందులో ఉన్న 11 మంది భారతీయులు దానిని వదిలేసి చిన్నపాటి లైఫ్ బోటులో ప్రాణాలు కాపాడుకునే యత్నం చేశారు. ఈ క్మంలో 10 మంది భారతీయులు చిన్నబోటులో సురక్షిత ప్రాంతానికి చేరుకోగా? మరో వ్యక్తి మాత్రం గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. కాగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిరకు ఇరాన్‌లో 8,531 మంది మరణించారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏఎన్ఏ పేర్కొంది. వీరిలో 5,607 మంది సామాన్య పౌరులు ఉన్నారని తెలపడం గమనార్హం. అంతేకాదు మృతుల్లో 1244 మంది పిల్లలు కూడా ఉన్నారని పేర్కొనడం గుండెతరుక్కుపోయే విషం. క్షేత్రస్థాయి నివేదికలు, స్థానికుల సమచారం, వైద్య, అత్యవసర వనరులు, అధికారిక ప్రకటనల ఆధారంగా తాము ఈ సమాచారాన్ని సేకరించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారం ఆధారంగా ఇరాన్‌లో 5500 మందికి పైగా చనిపోయారని పేర్కొంది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ సంస్థ అయిన రెడ్‌క్రాస్ వాదన మరోతీరు ఉంది. అమెరికా –ఇజ్రాయెల్ దాడుల మూలంగా ఇరాన్‌లో ఇప్పటివరకు కనీసం 3,900 మంది మరణించగా, 60,000 మంది గాయపడ్డారని పేర్కొన్నది. ఇక, మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1124 మంది చిన్నారులతో పాటు దాదాపు 3,368 మంది లెబనాన్ పౌరులు మరణించారని లెబనీస్ అధికారులు వెల్లడించారు. అలాగే, లెబనీస్ సాయుధ సంస్థ హిజ్బుల్లాకు చెందిన 400 మంది సైనికులు మరణించారని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాక్‌లో 702మంది మరణించారు.ఇరాన్ దాడికి ఖండిస్తూ ఆ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. దాడి జరిగిన సమయంలో ఓమన్ ప్రభుత్వం వేగంగా స్పందించి ప్రమాదంలో పడిన భారతీయులను కాపాడిందని ఆ శాఖ తెలిపింది. భారతీయులను కాపాడిన ఓమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గల్లంతైన వ్యక్తి కోసం ఓమన్ దేశ సహాయక సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టినట్లు తెలిపింది.







## అటు పందులు...

# ఇటు కుక్కలు..!

### హడలెత్తుతున్న మెట్‌పల్లి పట్టణ ప్రజలు

- వీధి జంతువుల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 15 (ప్రజాకలం) మెట్‌పల్లి పట్టణంలో వీధి కుక్కలు, పందులు అధిక సంఖ్యలో సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో ఎటు చూసినా కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తుండగా, వాటి నియంత్రణకు మున్సిపల్ అధికారులు, పాలకులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల వీధి కుక్కలు చిన్నారులపై దాడి చేసిన ఘటనలు చోటుచేసుకోగా, పందులు బురద కుంటలు, ఖాళీ ప్రదేశాల్లో సంచరిస్తూ దుర్వాసనతో పాటు అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని, "క్లీన్ సిటీ" పేరుతో ప్రచారాలకే పరిమితమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పాలకులు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వీధి జంతువుల సంఖ్య పెరిగిందేగానీ, వాటి నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. అలాగే, పందులు చనిపోయిన సందర్భాల్లో వాటి కళేబరాలను సకాలంలో తొలగించకపోవడంతో వీధి కుక్కలు వాటిని పీక్కుతింటున్నాయని, ఇది మరింత ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మృత జంతువులను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం వీధి కుక్కలు, పందుల సమస్యతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వీధి జంతువుల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**టీచర్ కాలనీలో పిచ్చికుక్కల బీభత్సం.. చిన్నారులపై వరుస దాడులు**

మెట్‌పల్లి మున్సిపాలిటీ 12వ వార్డులోని టీచర్ కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మూడు రోజుల క్రితం కాలనీలో ఒక పంది చనిపోగా, దాని కళేబరాన్ని కొన్ని పందులు, వీధి కుక్కలు తిన్నాయని తెలిపారు. అనంతరం కుక్కలు అసాధారణంగా ప్రవర్తిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. జూలై 13న నలుగురిపై కుక్కలు దాడి చేయగా, వారిలో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. తాజాగా బుధవారం అబుసుఫియాన్ అనే బాలుడిపై కూడా వీధి కుక్క దాడి చేసి కాటు వేసినట్లు తెలిపారు. దీంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.వెంటనే వీధి కుక్కలను పట్టుకుని నియంత్రించాలని, మృత జంతువుల కళేబరాలను సకాలంలో తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. చిన్నారుల భద్రత దృష్ట్యా అత్యవసర చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమే : కాంగ్రెస్ నేతలు




బీఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి చౌకబారు రాజకీయాలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఈ ఏడాది వర్షాభావానికి ఎల్‌నినో ప్రభావమే కారణమని, దీనికి రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం సరికాదన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డీ–29 కాలువ అభివృద్ధిపై తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం రైతులకు యూరియా సరఫరా, ఎరువుల అక్రమ నిల్వల నియంత్రణ, బ్లాక్ మార్కెటింగ్ నివారణకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని, మక్కజొన్న, వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.ప్రతిపక్షాలు అసెంబ్లీలో నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిందిపోయి రాజకీయ ఆరోపణలకు దిగడం సరికాదని,తెలంగాణ ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖుతుబుద్దీన్ పాషా, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, ఉపసర్పంచ్ ఇప్పపల్లి గణేష్, వంగ అశోక్ యాదవ్, మొగిలి రాజేందర్, సమీర్ సర్కార్, అన్వర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- యువతకు వాలీబాల్స్ పంపిణీ చేసిన యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆలకుంట రాజేశం



రామగుండం,జూలై 15:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) గ్రామీణ ప్రాంతాల యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని,శారీరక దృఢత్వాన్ని సాధించాలనే ఉద్దేశంతో అంతర్గాం మండల కేంద్రంలో యువతకు క్రీడా సామగ్రిని అందజేశారు.స్థానిక యువత అభ్యర్థన మేరకు యూత్ కాంగ్రెస్ నాయకులు ఆలకుంట రాజేశం స్వయంగా క్రీడాకారుల వద్దకు వెళ్లి రెండు వాలీబాల్స్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి తరం యువత చెడు వ్యసనాలకు, సామాజిక మాధ్యమాల అతి వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.శారీరక,మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని,వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు.యువత కేవలం చదువులకే పరిమితం కాకుండా, ఆటల్లో కూడా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తమ గ్రామానికి,మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలను ముమ్ముందు కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దొబ్బల తరుణ్ కుమార్,దండుగుల రఘు కార్తీక్,శ్రీను,లక్ష్మణ్,రాకేష్,రాజేష్ లతో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు,క్రీడాకారులు,కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తమకు క్రీడా సామగ్రిని అందజేసి ప్రోత్సహించినందుకు స్థానిక యువత,క్రీడాకారులు ఆలకుంట రాజేశం బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - ప్రతి సర్వే నంబర్‌ను వరుస క్రమంలో ఖచ్చితంగా నమోదు చేయాలి
- ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలి



పెద్దపల్లి,జూలై15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో చేపట్టిన భూ రీ–సర్వే ప్రక్రియను పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.బుధవారం పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ–సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.అనంతరం పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన,ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలును పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ భూ రీ–సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తతో పనులు చేపట్టాలని సూచించారు.ప్రతి సర్వే నంబర్‌ను వరుస క్రమంలో ఖచ్చితంగా నమోదు చేయాలని,రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా భూ రీ–సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నిట్టూరు గ్రామంలోని పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు.ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు తప్పనిసరిగా అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై మంచి అవగాహన కల్పించాలని,విద్యా ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని,ప్రీ–ప్రైమరీ తరగతుల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రతి విద్యార్థి చదవగలిగే స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు బోధన అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని,మరుగుదొడ్లలో ఎల్లప్పుడూ నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఏడీ సర్వే సోమేశ్వర్,జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసులో 5 గురికి జీవిత ఖైదు...

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 15 (ప్రజా కలం)జగిత్యాల జిల్లా మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో మైనర్ బాలికపై జరిగినసామూహిక అత్యాచారం కేసులో ఫాస్ట్రక్ స్పెషల్ సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిని దోషులుగా నిర్ధారిస్తూజీవిత ఖైదు విధించడంతో పాటు ఒక్కో నిందితుడికి రూ.20 వేల జరిమానా విధించింది. బాధిత మైనర్ బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలనికూడా కోర్టు ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం..2020 అక్టోబర్ లో మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై లోకిని రాజేష్, దారంగుల సాయికుమార్, మొగిలిపాక అనిల్ కుమార్, కుంచెపు శివ, కుంచెపు వెంకటేష్ కలిసి సామూహికఅత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై అప్పటి ఎస్సై సదాకర్ కేసు నమోదు చేయగా, అప్పటి డీఎస్పీలు గౌస్ బాబా, రవీందర్ రెడ్డి లు సమగ్ర దర్యాప్తు చేపట్టి పటిష్టమైన ఆధారాలతో ఛార్జిషీట్ ను కోర్టులో దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు బలమైన వాదనలువినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రత్న పద్మావతి ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. అదనంగా ఒక్కో నిందితుడికి రూ.20 వేల జరిమానా విధించి, బాధితురాలికి మొత్తం రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు, విద్యార్థినులు తమపై జరిగే వేధింపులు, నేరాలపై నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని, నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరం చేసిన ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు, దర్యాప్తు అధికారులు గౌస్ బాబా, రవీందర్ రెడ్డి, అప్పటి ఎస్సై సదాకర్, సీఐఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ రంజిత్, సీఐఎంఎస్ కానిస్టేబుళ్లు కిరణ్ కుమార్, శ్రీధర్, రాజు తదితరులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





# కథాలపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

## ప్రజలకు సత్వర న్యాయం – విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి
## మహిళల భద్రతకు ప్రాధాన్యం, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

జగిత్యాల్ ప్రతినిధి జులై 15 (ప్రజా కలం)

జగిత్యాల్ జిల్లాలోని కథాలపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి, విచారణలో ఉన్న కేసుల పురోగతిని తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై అధికారులతో సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసింగ్ ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంతో పోలిస్తే నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని పేర్కొంటూ, ప్రజలు పోలీసులపై విశ్వాసం ఉంచి అసాంఘిక కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, యువతలో చట్టం పట్ల గౌరవం పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచడంతో పాటు సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత విధానం పాటించాలని అధికారులకు సూచించారు. రిసెప్షన్ విభాగాన్ని నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్ల నమోదు చేసిన పిటిషన్ మేనేజ్‌మెంట్ డేటాను పరిశీలించిన ఎస్పీ, ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో నమోదు చేసి, దరఖాస్తుదారులకు రిసిప్ట్ ఇవ్వాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ పరిశుభ్రతను కాపాడాలని, ఫైళ్లను నిర్దేశిత ప్రదేశాల్లో క్రమబద్ధంగా భద్రపరచాలని సూచించారు.

అనంతరం సిబ్బందితో సమావేశమై క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటిన ఎస్పీ, పచ్చదనం, పరిశుభ్రత కోసం ప్రతి పోలీస్ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, డీసీఆర్‌బీ ఎస్ఐ ప్రదీప్, కథాలపూర్ ఎస్ఐ రవి కిరణ్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశల ఇల్లు... తీరని బాకీలు..

## తాకట్టు పడ్డ పుస్తెలు... నిర్మాణం పూర్తైన రాని ఇందిరమ్మ ఇంటి బిల్లులు
## ఫైనల్ బిల్లులకై నిరీక్షిస్తున్న లబ్ధిదారులు.

నిర్మల్ జూలై15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఆ ఊరి చివర కొత్తగా కట్టుకున్న ఇందిరమ్మ ఇల్లు చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది, కానీ ఆ ఇంటి యజమాని లక్ష్మికి మాత్రం అది ఒక తీరని కలలా, గుండెపై ఒక బండలా మారింది.

నిర్మల్ జిల్లాలోని ఆయ గ్రామాలలో ఉండే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, తనకంటూ ఒక సొంత ఇల్లు ఉండాలనే కలని ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజం చేసుకోవాలనుకున్న కల ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు, ఉన్న కొద్దిపాటి పొదుపు మొత్తాన్ని కలిపి ఎలాగోలా ఇల్లు పూర్తి చేశారు. "సొంత గూడు దొరికింది, ఇక ప్రశాంతంగా బతకవచ్చు" అని ఆ ఇంట్లోకి మారి అప్పుడే ఆరు నెలలు గడిచిపోయింది. కానీ ఆ ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుండి ఆమెకు మనశ్శాంతి కరువైంది.

**తాకట్టు పడ్డ పుస్తెలు... రాని బిల్లులు**

ఇల్లు పూర్తి కావడానికి చివరి దశలో చేతిలో డబ్బులు లేక, ప్రభుత్వం ఇచ్చే ఆఖరి బిల్లు (ఫైనల్ బిల్లు) త్వరగానే వస్తుందనే నమ్మకంతో లక్ష్మి తన మెడలోని పుస్తెల తాడును తాకట్టు పెట్టి మరీ డబ్బులు తెచ్చి మేస్త్రీకి ఇచ్చింది. రోజులు వారాలయ్యాయి, వారాలు నెలలయ్యాయి... ఆరు నెలలు గడుస్తున్నా ఆ చివరి బిల్లు మాత్రం రాలేదు.

ప్రతిరోజూ ఉదయం లేవగానే లక్ష్మి చూపులు పంచాయతీ ఆఫీస్ వైపో, లేదా బ్యాంకు వైపో వెళ్తుంటాయి. అప్పు ఇచ్చినవాళ్ల ఒత్తిడి ఎక్కువవుతోంది. తెచ్చిన అప్పుకు వడ్డీ పెరుగుతోంది. మెడలో తాకట్టు పెట్టిన పుస్తెల తాడును విడిపించుకోవడానికి రూపాయి కూడా చేతిలో లేదు.





"ఇల్లు కట్టుకుంటే ఉన్న ఊరు పాడు అన్నట్టుంది నా పరిస్థితి. సొంత ఇల్లనే ఆశతో ఉన్న పుస్తెలు కూడా తాకట్టు పెట్టుకున్నా. కానీ ఆరు నెలలైనా ఆఖరి బిల్లు రాకపోతే మాలాంటి పేదవాళ్లం ఎలా బతకాలి?" అంటూ లక్ష్మి కన్నీరుమున్నీరవుతోంది.

ఇది ఒక్క లక్ష్మి కథ మాత్రమే కాదు... నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని, ఆఖరి బిల్లుల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న వందలాది మంది లబ్ధిదారుల ఆవేదన. సొంత ఇంటి కల నిజమైనా, పెండింగ్ బిల్లుల భారం వారిని రోజురోజుకూ కుంగదీస్తోంది. ప్రభుత్వం త్వరగా స్పందించి ఈ ఫైనల్ బిల్లులను విడుదల చేస్తేనే, ఈ పేదల జీవితాల్లో నిజమైన వెలుగు వస్తుంది.

# పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల విద్యాధికారి జి. సురేష్



ప్రజా కలం జూలై 15 (గద్వాల ప్రతినిధి)

మల్దకల్ మండల విద్యాధికారి జి. సురేష్ మండలంలోని మల్లెందొడ్డి, చిప్పదొడ్డి,విఠలాపురం, విఠలాపురం, యం పి యూ పి ఎస్, నాగర్ దొడ్డి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్లెందొడ్డి పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ స్టవ్‌పై మధ్యాహ్న భోజన వంట కార్యక్రమాన్ని ప్రారంభించి, వంటశాల నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, హాజరు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. చిప్పదొడ్డి పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, బోధన విధానాలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలను పరిశీలించి విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.విఠలాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్‌తో కలిసి పాఠశాలకు అవసరమైన వంట షెడ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగర్ దొడ్డి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంపై ఆకస్మిక తనిఖీ నిర్వహించి, భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత, నిల్వ విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మధ్యాహ్న భోజన నిర్వహణ, ప్రభుత్వ మార్గదర్శకాల సంపూర్ణ అమలుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

# తండ్రి హత్యకు ప్రతీకారం

## - ఐదుగురు నిందితుల అరెస్ట్ - శెట్టి ఆత్మకూర్ హత్య కేసును వేగంగా ఛేదించిన గద్వాల పోలీసులు
## - విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ వై. మొగులయ్య

ప్రజా కలం జూలై 15 (గద్వాల ప్రతినిధి)

పాత కక్షలను మనసులో పెట్టుకొని ఈనెల 10వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్ గ్రామ శివారులోని పొలాల్లో గుంటిపల్లి రాజు డోజర్ రాజు (42) అనే వ్యక్తిని కర్రలతో కొట్టి దారుణంగా హత్య చేసిన కేసులో ఐదుగురిని గద్వాల్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం గద్వాల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వై. మొగులయ్య కేసు వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ టంగుటూరిశ్రీను, రూరల్‌ఎస్సై సిహెచ్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేసు వివరాలు..

శెట్టి ఆత్మకూర్ గ్రామానికి చెందిన గుంటిపల్లి రాజు ఈనెల 10న సాయంత్రం గ్రామానికి చెందిన కృష్ణయ్య గౌడ్ పొలం వద్ద బోరు వేస్తుండగా చూడటానికి వెళ్ళాడు. ఆ సమయంలో పాత కక్షలను మనసులో ఉంచుకున్న ప్రత్యర్థులు కర్రలతో అతనిపై విచక్షణారహితంగా దాడి చేశారు.

తీవ్ర రక్తగాయాలైన రాజును గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు గుంటిపల్లి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గద్వాల్ రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**తండ్రి హత్యకు ప్రతీకారంగానే**

పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. మృతుడు గుంటిపల్లి రాజుకు, అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు భార్య సైదమ్మతో గతంలో అక్రమ సంబంధం ఉండేది. ఈ విషయమై 2017లో జరిగిన గొడవలో రాజు



చేతిలో ఆంజనేయులు హత్యకు గురయ్యాడు. ఆ కేసులో రాజుకు కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించగా, అతడు హైకోర్టు నుండి బెయిల్ తెచ్చుకుని బయట తిరుగుతున్నాడు. తమ తండ్రిని చంపిన రాజుపై కక్ష పెంచుకున్న ఆంజనేయులు కుమారులు దొబ్బలి విజయ్ కుమార్, బాల నేరస్థుడు మరియు బంధువులు దొబ్బలి లోకేష్, గోవర్ధన్, దొబ్బలి శ్రీరాములు కలిసి ఈనెల 10న ఒంటరిగా దొరికిన రాజును కర్రలతో కొట్టి హతమార్చారు.

**రికవరీ మరియు అభినందనలు...**సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను బుధవారం గద్వాల పట్టణంలోని కోట ప్రాంగణంలో అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు (హోండా యూనికార్న్, స్ప్లెండర్ ప్లస్), ఒక వీవో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన సీఐ టంగుటూరి శ్రీను, రూరల్ ఎస్సై సిహెచ్. శ్రీకాంత్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కొయ్యూరు గ్రామ అభివృద్ధి పనులకు నిధుల విడుదల

## మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ



మల్హర్, జూలై 15 ప్రజాకలం ప్రతినిధి...

మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మైనార్టీ లకు సంబంధించి మసీదు అభివృద్ధి కొరకు 20 లక్షల రూపాయలు, చర్చిలకు ఐదు లక్షల రూపాయలు. పివి నగర్ కు సంబంధించి మాడ్రన్ బస్టాండ్ కొరకు 3 లక్షలు, కొయ్యూరు బస్టాండ్ లో ప్రయాణికులకు సౌకర్యార్థం సంబంధించి పబ్లిక్ టాయిలెట్స్ లక్ష రూపాయల నిధులను ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. మంథని నియోజకవర్గ గ్రామాల్లో అభివృద్ధికి భారీగా నిధుల మంజూరు చేయిస్తూ, ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్న సమర్థవంతమైన నాయకులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు కొయ్యూరు గ్రామ ప్రజల పక్షాన గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండా రాజమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్యుమరేషన్ ఫామ్ ల ఆన్ లైన్ వెంటనే పూర్తి చేయాలి:



నిర్మల్ ,జులై 15(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం భైంసా పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.

పంపిణీ చేసిన ఎస్ఐఆర్ ఫాంలు, పూర్తి చేసిన ఆన్ లైన్ ప్రక్రియ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం పూర్తి పారదర్శకంగా పూర్తిచేయాలని ఆదేశించారు.అనంతరం నిర్మల్ పట్టణంలోని 24 వ వార్డులో ఎస్ఐఆర్ తీరును పరిశీలించారు. ఆన్ లైన్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బిఎల్ఓ యాప్ ను పరిశీలించారు. స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఫారములు పూరించి, వెంటనే ఫారములు బిఎల్ఓ లకు అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసిల్దార్లు శశిభూషణ్, రాజు, ఎంపీడీవో నీరజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటిలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

## - రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం

నిర్మల్ జూలై 15(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన వర్సిటీని సందర్శించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాంపస్‌లో విద్యార్థులకు నిరంతర విద్యుత్, సురక్షిత త్రాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఏ విద్యార్థి చదువు మధ్యలో ఆపేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, చదువు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యాబోధన తీరుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చదువు



పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్సిటీ అభివృద్ధి, వసతుల గురించి చైర్మన్‌కు వివరించారు. అనంతరం చైర్మన్ ను, కమిషన్ సభ్యులను అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కుస్రం నీలాదేవి, వైస్ చాన్సలర్ గోవర్ధన్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ వెంకట రామయ్య, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ అజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిద్రావస్థలో అటవీ శాఖ ఉన్నతాధికారులు

## తాడిచెర్లలో యథేచ్ఛగా వృక్షాల నరికివేత....స్థానిక బీట్ ఆఫీసర్ అండదండలపై ఆరోపణలు...
## భారీగా ముడుతున్న ముడుపులు ఉన్నతాధికారులకు ..?
## అటవీ శాఖ అధికారులు కనుమరుగైనారు..

మల్హర్, జూలై 15 ప్రజాకలం ప్రతినిధి...

ఒకవైపు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కలు నాటుతుంటే, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల క్షేత్రస్థాయిలో పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. తాడిచెర్ల మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో గత కొద్దిరోజులుగా వేప, చింత వంటి విలువైన వృక్షాల నరికివేత, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.



**స్థానిక బీట్ ఆఫీసర్ ఆడుతున్న చదరంగమా ?**

ఈ అక్రమ వ్యాపారానికి, రవాణాకు స్థానిక బీట్ ఆఫీసర్ పూర్తి అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు తాడిచెర్ల వ్యాప్తంగా బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా అటవీ శాఖ కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారులు 'ఐ డోంట్ మాకు సంబంధం లేదు !**

స్థానికులు, పర్యావరణ ప్రేమికులు నెత్తీనోరూ బాదుకుంటున్నా ఫారెస్ట్ ఉన్నతాధికారులు మాత్రం "ఎవరేమనుకున్నా ఐ డోంట్ కేర్" అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సింది పోయి, దానికి పరోక్షంగా ప్రోత్సాహం అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ఫారెస్ట్ అధికారులు సైతం ఈ వ్యవహారంలో పూర్తిగా నిద్రావస్థలో మునిగిపోయారు. పచ్చని ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్న అక్రమార్కులపై, వారికి సహకరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కుబీర్ కాంగ్రెస్‌లో 'వలస' చిచ్చు

## – ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు సీనియర్ల అల్టిమేటం!

**- ఏళ్ల తరబడి జెండా మోస్తే పక్కన పెడతారా? - మండల అధ్యక్షుడిని మార్చకుంటే మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం**

**- ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన**

నిర్మల్, జులై 15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి):నిర్మల్ జిల్లా కుబీర్ మండల కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మండల అధ్యక్ష పదవి ఎంపిక తీవ్ర వివాదాస్పదంగా మారడంతో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం ఏళ్ల తరబడి జెండా మోసిన నిబద్ధత గల నాయకులను పూర్తిగా పక్కన పెట్టడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వేరే పార్టీల నుండి వచ్చిన వలస నాయకులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టడంపై సీనియర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని మార్చుకుని, పార్టీ కోసం కష్టపడిన వారికే పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అధిష్టానం, డీసీసీ నాయకత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే మండలంలోని సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలమంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తామని ఈ సమావేశం వేదికగా సంచలన హెచ్చరిక జారీ చేశారు.

**ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం..**

మండల అధ్యక్ష పదవుల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కుబీర్ మండల పరిధిలోని 25 గ్రామాల్లో ఎస్సీ ఓటర్లు, 12 గ్రామ పంచాయతీల్లో ఎస్టీ సామాజిక వర్గం ప్రజలు విస్తరించి ఉండి, ఎన్నికల్లో పార్టీ విజయానికి కీలక పాత్ర పోషించారని



గుర్తు చేశారు. అంతటి బలం ఉన్న సామాజిక వర్గాలకు కీలక పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు.వలస వచ్చిన వారికి కాకుండా, పార్టీ కోసం శ్రమిస్తున్న ఎస్సీ లేదా ఎస్టీ వర్గాలకు చెందిన సీనియర్ నాయకులకు ఈ పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీసీ జనరల్ సెక్రటరీ బంక బాబు, డీసీసీ సెక్రటరీ రవి కుమార్, మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ వాహెద్, నాయకులు బషీర్, సందీప్, రాందాస్, గణేష్, సాహెబ్ రావు, జైవంత్, శ్రీనివాస్, ఆనంద్ రావ్, రాములు, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి టెస్ట్ బోర్డ్ సభ్యురాలు పోచనబోయిన ఈశ్వరమ్మకు క్షమాపణ చెప్పాలి..



## - తెలంగాణ యాదవ మహాసభ డిమాండ్

ఖమ్మం జులై 15( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోని బుధవారం గత మూడురోజుల క్రితం ప్రముఖ సంగసేవకురాలు సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నికార్సైన నాయకురాలు తెలంగాణ రాష్ట్రానికి పెద్దమ్మ శ్రీమతి పోచనబోయిన ఈశ్వరమ్మ యాదవ్ , 80 సవంత్సరాల వృద్ధురాలిని అవమానించేవిధంగా కించపరిచిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చరణ్ రెడ్డిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలి , ఈశ్వరమ్మ యాదవ్ కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి . కనీసం మహిళా వృద్ధురాలు అనే విచక్షణ లేకుండా బీసీ సమాజాన్ని యాదవ సమాజాన్ని అవమానించిన చరణ్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీసీసీబీ మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఛైర్మెన్ , తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కురాకుల నాగభూషణం యాదవ్ , బిఆర్ఎస్ పార్టీ నగర మాజీ అధ్యక్షులు , తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు పగడాల నాగరాజు యాదవ్ , జిల్లా అధ్యక్షులు కోడిలింగయ్య యాదవ్ , ప్రధాన కార్యదర్శి గుమ్మరోశయ్య యాదవ్ , సంఘం రాష్ట్ర నాయకులు ముడుముంతల గంగరాజు యాదవ్ , మహిళా అధ్యక్షురాలు ఇందుమతి యాదవ్ డిమాండ్ చేశారు . గోకుల కృష్ణ సేవాసమితి భవనం , మధురానగర్ ఖమ్మం లో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు . యాదాద్రి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలుగా పోచ్నబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ని రాష్ట్ర ప్రభుత్వం నియమించడాన్ని సహించలేని , జీర్ణం చేసుకోలేని ఆధిపత్య వర్గాలు ఈశ్వరమ్మ యాదవ్ పై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు . యూత్ కాంగ్రెస్ నాయకులు చరణ్ రెడ్డి వాళ్ళ నాన్న ప్రభాకర్ రెడ్డి యాదవ్ సమాజాన్ని బీసీ సమాజాన్ని వారి ఎదుగుదలను సహించ లేక అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారు . గత సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి ఈశ్వరమ్మ చేసిన సేవలకు గుర్తుగా చిన్న పదవి ఇస్తే తట్టుకోలేక పోతున్నారు . అక్కసు వెళ్ళగక్కుతున్నారు . యాదవులకు పదవులు ఇస్తే జీర్ణించుకోలేక పోతున్నపుడు యాదవుల బీసీ ల ఓట్లు ఎందుకు అడుగుతున్నారని నాయకులు ప్రశ్నించారు . 2శాతం లేని రెడ్డి సామాజిక వర్గం 15 శాతం జనాభా కలిగిన యాదవ్ సమాజాన్ని అవమానిస్తే రాబోవు కాలంలో రాజకీయంగా సమాధి చేయడానికి యాదవులు సిద్ధంగా ఉన్నారని నాయకులు తెలియజేశారు . ఇప్పటికైనా చరణ్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి లను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని , అదేవిధంగా ఈశ్వర్మ యాదవ్ చాలా పెద్దమనిషి పైగా మహిళా అనే కనీస సంస్కారం లేకుండా మాట్లాడిన వీళ్ళు ఈశ్వరమ్మ యాదవ్ కి వెంటనే క్షమాపణ బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు . లేకపోతే రాబోవు కాలంలో యాదవులు బీసీ ఎస్సీ ఎస్టీ మరియు ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉ ద్యమించి మీకు రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు . ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల సుగుణరావు యాదవ్ , మహిళా అధ్యక్షురాలు చిత్తూరు ఇందుమతి యాదవ్ , జల్లెల శ్రీనివాస్ యాదవ్ , సారిక రాము యాదవ్ , వల్లూరి తిరుపతిరావు యాదవ్ , చెవుల వెంకటేశ్వర్లు యాదవ్ , చిత్తూరు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాగొన్నారు .

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని

# పారదర్శకంగా, గడువు లోగా పూర్తి చేయాలి

**- అర్హులైన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే లక్ష్యం**

**- వంద శాతం డిజిటలైజేషన్ కోసం ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలి**

**- మ్యాపింగ్ పూర్తికాని ఓటర్లు నోటీసులు అందిన వెంటనే అవసరమైన పత్రాలు సమర్పించాలి**

**- అవసరమైన ధృవీకరణ పత్రాల కోసం మీ సేవ ద్వారా దరఖాస్తు చేస్తే వెంటనే జారీ చేస్తాం**

**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం, జూలై– 15( ప్రజా కలం న్యూస్)

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 8,48,491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 68.22 శాతం పురోగతికి సమానమని, ఇంకా 3,95,290 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే డిజిటలైజ్ చేసిన వివరాల్లో సుమారు 72 వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని, వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. సుమారు 25 వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలను మాత్రమే సమర్పించి, అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు.

డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల




ధ్రువీకరణ పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారులు 85 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తి చేయగలరని, అయితే 100 శాతం పూర్తి కావాలంటే ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా ఫారం అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్వోను సంప్రదించి ఫారం తీసుకోవాలని సూచించారు.

# ఆన్లైన్ లోనే ఇసుక బుకింగ్ ప్రక్రియ జరగాలి

## ప్రభుత్వ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**ఇంజనీరింగ్ శాఖల వారీగా ఇసుక వినియోగంపై సమగ్ర నివేదిక సమర్పించాలి**

**ఇసుక సరఫరాపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం, జూలై 15( ప్రజా కలం న్యూస్)

జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్లైన్ లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక సరఫరా ఆన్లైన్ లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఎంత పరిమాణం ఇసుక, ఎక్కడెక్కడి నుండి పొందింది నివేదిక స్నుర్పించాలన్నారు. ఇసుకను టీజీఎండీసీ, స్యాండ్ బజార్, స్థానికంగా సమకూర్చుకోవాలని, ఇదీ బుకింగ్ ఆన్లైన్ లోనే చేయాలని అన్నారు.

జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్ లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక రీచ్ ల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు వెంటనే సమర్పించాలని, ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై సమస్యలు ఉంటే వెంటనే నివేదిక అందించాలని, అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖలచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనుల పూర్తికి కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీవో టిజిఎండిసి జి. శంకర్, మైన్స్ ఏజి ఏ. రమేష్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, పీఆర్ ఇఇ లు మహేష్ బాబు, రామకోటి, డిఇ లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తురకగూడెంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, వ్యవసాయ నీటి కుంటల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం

పాలేరు జులై 15 (ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం పరిధిలోనే బుధవారం తురకగూడెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు మరియు వ్యవసాయ నీటి కుంటల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామడుగు వాణి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలయిన పెసర, కంది ,జొన్న ,ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు నష్టాలను నివారించవచ్చని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం వల్ల దిగుబడులు మెరుగుపడటంతో పాటు రైతుల ఆదాయం కూడా స్థిరంగా ఉంటుందని తెలిపారు.అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 100 శాతం రాయితీతో వ్యవసాయ నీటి కుంటలు (ఫార్మ్ పాండ్లు) నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటి కుంటలు 20 ఐ 20 ఐ 3 మీటర్లు, 12 ఐ 12 ఐ



2.5 మీటర్లు మరియు 8 ఐ 8 ఐ 2.5 మీటర్ల పరిమాణాల్లో నిర్మించబడతాయని వివరించారు.వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిని నిల్వ చేసి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవడానికి ఈ నీటి కుంటలు ఎంతో ఉ పయోగపడతాయని తెలిపారు. అలాగే భూగర్భ జలాల మట్టం పెరగడం, పంటలకు రక్షణాత్మక నీటిపారుదల అందించడం, కరువు పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం పెరగడం, చేపల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాలకు కూడా ఈ కుంటలు దోహదపడతాయని రైతులకు వివరించారు. అర్హత కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ భూముల్లో నీటి కుంటలను నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తురకగూడెం గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణాధికారి జానీ, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధినే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## – ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి – మధిర, ఎర్రుపాలెం మండలాల్లో రూ.60 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు



ఖమ్మం జులై 15( ప్రజా కలం న్యూస్)

మధిర నియోజకవర్గ గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో, మధిర మరియు ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీ లాడ్స్ నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన మొత్తం 14 సీసీ రోడ్లను ప్రారంభించారు. మధిర మండలం మాటూరు నుంచి ఆరంభమై ఎర్రుపాలెం రేమిడిచర్లలో ముగిసే..మధిర మండలం మాటూరు గ్రామం నుండి ప్రారంభమైన ఈ పర్యటన, ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, తక్కెళ్లపాడు, బనిగండ్లపాడు, మీనవోలు, ఎర్రుపాలెం మండల కేంద్రం, రేమిడిచర్ల గ్రామాల్లో కొనసాగింది. వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంపీ శ్రీకారం చుట్టారు. తక్కెళ్ళపాడు గ్రామంలో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

?ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. నేడు ప్రారంభించిన ఈ రోడ్లు గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగిస్తాయని చెప్పారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నానని అన్నారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మాజీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, అంకిరెడ్డి, సర్పంచులు ముక్కెర రామకృష్ణారెడ్డి, కూరపాటి రమేష్, అప్పారావు, నంద్రు అశ్విని, బలుసుపాటి జయరావు, కొత్తపల్లి ప్రశాంత్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిపాక రేంజ్ లో రేంజ్ ఆఫీసర్ పి వి వి ఎస్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో , సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం




ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జులై 14:

అడవుల విస్తీర్ణాన్ని పెంచి పచ్చదనాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విన్నుత కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుంది వాతావరణ మార్పులు అడవుల క్షీణత వంటి సవాలను ఎదుర్కొనేందుకు సాంకేతికతను వినియోగిస్తూ అటవీశాఖ పారిస్థాయిలో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టింది గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా రాష్ట్రము లో అధునాతన డ్రోన్ల ద్వారా అడవుల్లో విత్తనాలను చల్లటం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా కనిపిస్తుంది.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పోలవరం జిల్లా పరిధిలో జిల్లా అటవీ శాఖ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తున్నారు.ఈ సందర్భంగా,నెల్లిపాక రేంజ్ లో నెల్లిపాక రేంజ్ ఆఫీసర్ పి వి వి ఎస్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో , సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం బుధవారం నాడు కే ఎన్ పురం బిట్ కంపార్ట్మెంట్ నెంబర్ 236నందు డ్రోన్ ద్వారా విత్తన బంతుల వెదజల్లే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీ ఆర్ ఓ ఎస్. అశ్వినీ కుమార్, ఎఫ్ ఎస్ ఓ శేఖర్, ఎఫ్ ఎస్ ఓ నెల్లిపాక ఏ సతీష్, బీట్ ఆఫీసర్స్ ప్రశాంత్, శ్రీకాంత్ ఝాన్సీ పవన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం చేసిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు



( వరంగల్/ పర్వతగిరి) జులై 15, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండల కేంద్రంలో బుధవారం పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పరామర్శించి ఓదార్చారు. తొలుత తన డ్రైవర్ గా పనిచేసిన బైరబోయిన బిక్షపతి తల్లి లచ్చమ్మ ఇటీవల మృతిచెందగా పరామర్శించి ఆర్థిక సాయం చేసి, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రావుల రాజు మాతృమూర్తి మరణించగా ఓదార్చారు. తదుపరి మంచాల అశోక్ ఇటీవల మరణించగ పరామర్శించి, బీజేపీ సీనియర్ నాయకులు నాయకులు గడదాసు వీరాస్వామి దశదినఖర్మ లో హాజరై ఆయన కుమారులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్, ప్యాక్స్ వైస్ ఛైర్మన్ సందేల నవీన్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మహమ్మద్ సర్వర్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, నాయకులు గోనె సంపత్, జూలపెల్లి సురేందర్ రావు, కొండా వెంకన్న, జంగా సాంబయ్య, బోట్ల వెంకన్న,బోట్ల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థిని ఎంపిక



(వరంగల్/ పర్వతగిరి) జులై 15, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్-వనితా అచ్యుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని మారపాక భానుప్రియ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న మారపాక భానుప్రియ ఈ నెల 15న హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన అండర్--16 బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో ఒక కిలోమీటర్ పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి, ఈ నెల 18న మెదక్ జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు అర్హత సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని మారపాక భానుప్రియతో పాటు ఆమెకు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ రాజును కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబర్చి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ హెడ్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎ. రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సతీష్, అధ్యాపకులు జయశంకర్, మహేశ్వర్, సైదులు, సంతోష్, దంజ్య, విల్సన్ బాబు, వేణు, గుంషావళి, ప్రవీణ్, శ్రీలత, ధనలక్ష్మి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్.. ఇర్ఫాన్ కు ఘన సన్మానం..

హనుమకొండ జూలై 15 ప్రజా కలం ప్రతినిధి విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ ఇండియా.... తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు



గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ మెగా అచీవ్మెంట్లో సుమారు భారతదేశ వ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొనగా 1,212 మంది క్రీడాకారులు ఎంపిక య్యారు.ఈ పోటీలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు 40 నిమిషాల పాటు ఏకధాటిగా కిక్స్ అండ్ పంచెస్ చేసి తమ సత్తా చాటారు.గోల్డెన్ కిడ్స్ హై స్కూల్ కొత్తవాడ వరంగల్ లో 9వ తరగతి చదువుతున్న 'మహ్మద్ ఇర్ఫాన్' ఈ పోటీలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు... గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు.రికార్డు సాధించిన ఇర్ఫాన్ ను స్కూల్ కరస్పాండెంట్ సుజాత ప్రిన్సిపాల్ మాధవి అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ క్రమశిక్షణ.. పట్టుదల.. సాధించాలని లక్ష్యం ప్రతి ఒక్క విద్యార్థి అలవర్చుకోవాలని చదువుతోపాటు స్పోర్ట్స్ లో రాణిస్తున్న ఇర్ఫాన్ కు మంచి భవిష్యత్తు ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత,స్వప్న,రాణి, అజంతా, శిరీష,హేమలత,జ్యోతి, లత, పావని, అస్మ,వనిత,శివశ్రీ, చంద్రశేఖర్, సత్యనారాయణ, సుగుణాకర్,విద్యాసాగర్,స్వప్న రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ కంట్రోల్ రూమ్,కమాండ్ కంట్రోల్ ను పరిశీలించిన సీపీ

హనుమకొండ జూలై 15 ప్రజా కలం ప్రతినిధి వరంగల్ పోలీస్ కమిషనర్‌హొఎన్. శ్వేత,ఐపీఎస్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూం,కమాండ్ కంట్రోల్ రూంను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కంట్రోల్ రూం సిబ్బంది పనితీరు, అత్యవసర కాల్స్ స్వీకరణ విధానం, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, నగరంలోని వివిధ ప్రాంతాలపై నిఘా,



సాంకేతిక వ్యవస్థల పనితీరును కమిషనర్ సమీక్షించారు.ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగవంతంగా అందేలా కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ,ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో మరింత సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు,శ్రీనివాస్, ఏసీపీ జితేందర్ రెడ్డి,ఆర్.ఐ సతీష్, క్లూస్ ఇన్స్ స్పెక్టర్ రాజ్ కుమార్, ఎస్. ఐ రోహిత్,ఆర్.ఎస్.ఐ శ్రవణ్ కుమార్ వున్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంపై కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి

( వరంగల్/ పర్వతగిరి) జులై 15, ప్రజాకలం ప్రతినిధి.

వర్ధన్నపేట నియోజకవర్గ పర్వతగిరి మండలం బిఎల్ఏ, సభ్యత్వ నమోదు, సోషల్ మీడియా కార్యకర్తలతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేయడంలో ఓటర్లకు అందుబాటులో ఉండాలని బీఎల్ఏలకు సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ ఓటర్లను కలిసి వారికి సాయం అందించాలని అన్నారు. ఈనెల 24 వరకే సమయం ఉన్నందున వీలైనంత తొందరగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా బిఎల్ఎ లు భాధ్యత తీసుకోవాలని అన్నారు. ఓటర్లకు ఉన్న సందేహాలు, సమాచారాన్ని ఆన్‌లైన్, ప్రింట్ ఓటర్ లిస్ట్‌ల ద్వారా ఓటర్లకు అందించాలని వివరించారు. ఇప్పటి వరకు పర్వతగిరి మండలం లోని అన్ని గ్రామాల పరిధిలో ఉన్న బూత్ లెవల్ ఏజెంట్ల నుంచి



ఎస్ఐఆర్ పై పూర్తి సమాచారాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరూరి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ మసూద్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, రంగు కుమార్, ప్యాక్స్ చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ ఎంపీపీ లూనావత్ కమల- పంతులు, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్, సర్పంచ్లు శ్రీనివాస్, దేవేందర్, కుమార్, వివేక్, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఐటీ నాగాలాండ్ నుండి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో

## పీహెచ్‌డీ పట్టా పొందిన డా.నీలిమ గుర్రపు

హనుమకొండ జూలై 15 ప్రజా కలం ప్రతినిధి

వరంగల్ నగరంలోని కాశీబుగ్గకు చెందిన డా.నీలిమ గుర్రపు ప్రస్తుతం ఎస్ఆర్ యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) నాగాలాండ్ నుండి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను అందుకున్నారు. డా.నీలిమ గుర్రపు తన పరిశోధనను ఎన్ఐటీ నాగాలాండ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నాగరాజు పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు.ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథం A Hybrid Machine Learning and Deep Learning Framework for Multimodal Rumor Detection on Online Social Media అనే అంశంపై రూపొందించబడింది. ఈ పరిశోధనలో ఆన్‌లైన్ సోషల్ మీడియా వేదికలలో వ్యాపించే తప్పుడు వార్తలు మరియు అపోహలను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్,డీప్ లెర్నింగ్ ఆధారిత వినూత్న మల్టీమోడల్ విధానాన్ని ప్రతిపాదించారు. ఈ పరిశోధన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్,డీప్ లెర్నింగ్ మరియు సోషల్ మీడియా అనలిటిక్స్ రంగాలకు విశేషమైన పరిశోధనా దోహదాన్ని అందించనుందన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ డా.నీలిమ గుర్రపుకు హృదయపూర్వక అభినందనలు



తెలియజేశారు. సురేష్ కుమార్ మండల, వీరమణి, పుష్పనీలా, సోదరులు గుర్రపు గోపినాథ్,గుర్రపు రఘు,రాజేష్,సోదరీమణులు శైలజ, లావణ్య,సుజాత,సుకన్య,చైతన్య, మౌనిక,సాధిక మండల,హాసిక మండల వారు సాధించిన ఈ అపూర్వ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ,ఆమె కృషి,పట్టుదల, అంకితభావాన్ని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధిస్తూ,పరిశోధన మరియు విద్యారంగంలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. డా. నీలిమ గుర్రపు సాధించిన ఈ పీహెచ్‌డీ విజయం కాశీబుగ్గ, వరంగల్ ప్రజలకు,కుటుంబ సభ్యులకు,గురువులకు, సహచరులకు మరియు విద్యా రంగానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె పరిశోధన భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో,ముఖ్యంగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని గుర్తించి నివారించే పరిశోధనలకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నరు.

## 4వ బెటాలియన్‌లో ఆర్కెస్ట్రా ప్రదర్శన




హనుమకొండ జులై 15 ప్రజా కలం ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 4వ బెటాలియన్‌లో నూతనంగా ఏర్పాటైన టీజీఎస్పి ఆర్కెస్ట్రా బృందం తమ సరికొత్త స్వరాలతో శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. బెటాలియన్ ఆవరణలో ఏర్పాటు చేసిన తమ సంగీత ప్రదర్శనలో ఈ ఆర్కెస్ట్రా బృందం మధుర గీతాలను ఆలపించారు.తమ అద్భుతమైన గానంతో,వాయిద్యాల మేళవింపుతో బెటాలియన్ అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు మైమరచిపోయారు.కార్యక్రమం ప్రారంభం నుండి ముగింపు వరకు ఆర్కెస్ట్రా బృందం సభ్యులు ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్‌తో అలరించారు.నూతన,పురాతన సినీ మధుర గీతాలను ఆలపిస్తూ,దానికి తగ్గట్టుగా వాయిద్యాలను వాయిస్తూ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. అతి తక్కువ కాలంలోనే శిక్షణ పూర్తి చేసుకుని,ఇంత ప్రొఫెషనల్ స్థాయిలో,అత్యంత ప్రతిభావంతంగా సంగీతాన్ని పలికించడంపై అక్కడికి విచ్చేసిన ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.ఆర్కెస్ట్రా ప్రతిభను చూసి ప్రేక్షకులు చప్పట్లతో, ఈలలతో తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.బెటాలియన్ లోని తెలుగు,ఇంగ్లీష్ మీడియం పాఠశాల విధార్థినిలు,పోలీసు సిబ్బంది పిల్లలు వెస్టర్న్,క్లాసికల్ పాటలకి అద్భుతంగా డాన్స్ చేసారు.ఈ సందర్భంగా 8వ బెటాలియన్ కమాండెంట్ ఎమ్.రామకృష్ణ మాట్లాడుతూ.. చాలా తక్కువ కాల వ్యవధిలో ఆర్కెస్ట్రా బృందం ఈ స్థాయి నైపుణ్యాన్ని ప్రదర్శించడం పై హర్షం వ్యక్తపరిచారు. పోలీసుల విధుల్లో ఉండే ఒత్తిడిని దూరం చేయడానికి, సిబ్బంది మానసిక ఉల్లాసానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ కె. బాలయ్య,ఈ.వీరన్న, జె.రాజేందర్, ఆర్ఐలు విజయ్,కార్తీక్, వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్,రాంప్రసాద్,కృష్ణ మరియు అధికారులు,పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## టీజీ టి -20 ఛాంపియన్ ఆటగాడు బాకీ హిషాంత్ కు ఘన సన్మానం..

గజ్వేల్:15 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీ-20 టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్ బాకీ హిషాంత్ గజ్వేల్ సీఐ రవికుమార్,గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధికారులు బాకీ హిషాంత్ సాధించిన విజయాన్ని అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు సూచించారు.బాకీ హిషాంత్ ను సన్మానించినందుకు కుటుంబ సభ్యులు,స్నేహితులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## మహాసభలో నూతన ఏఐటియుసి మండల కౌన్సిల్ ఎన్నిక

### శంషాబాద్ మండల గౌరవ అధ్యక్షులు నర్రాగిరి అధ్యక్షులు టి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గిలక రాజు

శంషాబాద్, జులై 15,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలో ఏఐటియుసి 5వ మహాసభ రోజు పట్టణ కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలో నూతన ఏఐటియుసి మండల కౌన్సిల్ నీ ఎన్నుకోవడం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనపల్లి జైపాల్ రెడ్డి ఎల్.ఐ.టి హోటల్లో నూతనంగా ఎన్నికైన శంషాబాద్ మండల గౌరవ అధ్యక్షులు నర్రాగిరి, అధ్యక్షులు టి.శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి గిలక రాజు, ఉపాధ్యక్షులు దండు రవికుమార్, ఎద్దుల శ్రీను గార్లను మహాసభలో కార్మికులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వనంపల్లి జైపాల్ రెడ్డి వారికి ఘనంగా శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ మండలంలో ఏఐటియుసి అన్ని రంగాల్లో విస్తరింపజేసి బలోపేతం చేయాలని కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని తెలిపారు.



## బేగంపేట పాఠశాలలో చేతిరాతపై ప్రత్యేక శిక్షణ.

దుబ్బాక ప్రజాకలం జూలై 15.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బేగంపేటలో ప్రముఖ చేతిరాత నిపుణులు ఎజాజ్ అహ్మద్ విద్యార్థులకు చేతిరాతపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అందమైన చేతిరాత ప్రాముఖ్యత, రాయాల్సిన విధానం, మంచి మార్కులు సాధించేందుకు



పాటించాల్సిన సూచనలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల మాట్లాడుతూ అందమైన చేతిరాత విద్యార్థుల విజయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారుల అక్రమ దందా

### - ప్రైవేట్ వ్యక్తులచే డబ్బులు వసూలు - డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరింపులు

### - ఆర్థిక పరిస్థితి ఉండగా డబ్బులు కట్టలేక ఆత్మహత్య శరణం అంటున్న బాధితులు

సంగారెడ్డి జిల్లా ప్రజాకలం జులై 15

నారాయణఖేడ్ నియోజకవర్గంలో పలు మండలాల్లో, మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న వడ్డీ వ్యాపారం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. వడ్డీ వ్యాపారుల అరాచకాలు అంతా ఇంత కాదు చాలా ఇబ్బందులకు గురిచేస్తూ వారు చెప్పినట్టు డబ్బులు కడితే మంచిది లేదంటే వారిని నట్టేట ముంచే స్తున్నారు. ఈ ప్రాంతంలో వడ్డీ వ్యాపారులని ఆడింది ఆట పాడింది పాటగా కొనసాగుతుంది. ఈ తంతు అడిగే నాథుడే కరువయ్యారు. నారాయణఖేడ్ ప్రాంతంలో జోరుగా వడ్డీ వ్యాపారాలు ఇచ్చేటప్పుడు ఒక మాట డబ్బులు ఇచ్చినంక ఇంకొక మాట మాట్లాడి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఆపద ఉన్నప్పుడు ఎవరి అవసరాలకు వారు డబ్బులు తీసుకుంటారు. అదే ఆసరా చేసుకుని వడ్డీ వ్యాపారులు ఇష్ట రాజంగా సామాన్యుడి దగ్గర నిలువు దోపిడీ చేస్తున్నారు. డబ్బులు కడతారా కట్టండి లేదంటే ఇంటి దగ్గరికి ప్రైవేట్ గుండాలను తీసుకు వచ్చి గొడవలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదు చాలా కుటుంబాలు రోడ్డున పడ్డారు. బాధితులు ఇంత వడ్డీ వసూలు చేస్తున్నారు అని అడిగితే అది నా ఇష్టం అంటూ మీరు ఎవరికి చెప్పకుంటే వారికి చెప్పుకోండి నూటికి 3 రూపాయలు లేదా 4, 5 రూపాయలు వడ్డీలు వసూలు చేస్తూ చాలా కుటుంబాలు సర్వనాశనం అయిపోయి రోడ్డున పడ్డారు. బాధితులు ఎవరికి చెప్పుకుందామన్న భయంతో చెప్పుకోలేకపోతున్నారు. ఇదే ఆసరా చేసుకుని పలు కుటుంబాల ఇంటి దగ్గరకు వెళ్లి బెదిరింపులకు గురి చేస్తున్నారు. నారాయణఖేడ్ లో చాలామంది వడ్డీ వ్యాపారం చేస్తూ బాధితుల రక్తం తాగుతున్నారు. వడ్డీ వ్యాపారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు ఈ వడ్డీ వ్యాపారులపై జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోకపోతే చాలా మంది




కుటుంబాలు ఆత్మహత్య శరణం అంటూ బాధితులు వాపోతున్నారు. వడ్డీ వ్యాపారులు వడ్డీ వ్యాపారం చేస్తూ పెద్ద పెద్ద బిల్డింగులు కడుతున్నారు. కొందరు వ్యక్తులు పట్టాదారులపై భూములు రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా వడ్డీ వ్యాపారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# చేనేత అభివృద్ధే లక్ష్యం

## ఏడీని కలిసిన గజ్వేల్ సంఘం నూతన కార్యవర్గం

గజ్వేల్ :15 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడు స్వర్గం రాజేశం ఆధ్వర్యంలో బుధవారం నూతన కార్యవర్గం సభ్యులు,డైరెక్టర్లు సిద్దిపేట చేనేత



శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) బుచ్చప్పను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు,వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి అధికారులు సహకరించాలని సంఘం ప్రతినిధులు కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎలగందుల రామచంద్రం,ఉపాధ్యక్షుడు వల్లందాస్ సత్యనారాయణ,డైరెక్టర్లు దొంతుల ప్రసాద్,గాడిపల్లి విజయ్ కుమార్, చెప్యాల మల్లేశం,భాగ్యలక్ష్మి, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామానికి పటాన్‌చెరు సిద్ధం

## -యువ సంగ్రామానికి పటాన్‌చెరు నుంచి 5 వేల మంది యువత..

పటాన్‌చెరు, జులై 15 (ప్రజా కలం) ప్రతిని

నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని



డిమాండ్ చేస్తూ ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించే బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది యువత హాజరవుతారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.బుధవారం పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఎన్నికల ముందు ప్రియాంక గాంధీ ప్రకటించిన నిరుద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువత సంక్షేమంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యువ సంగ్రామ సదస్సుకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ఐదు వేల మంది యువతను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఓటరు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# వర్షాభావంతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

## బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు, జులై 15,(ప్రజా కలం)

వర్షాభావంతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహారెడ్డి అన్నారు.కందుకూరు మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహారెడ్డి స్థానిక గ్రామస్థులతో కలిసి పరామర్శించారు.మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన,వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గుర్తించి,పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,సాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు,ప్రభుత్వ పరంగా అన్ని విధాలా అండగా నిలిచి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే స్పందించడం అత్యంత అవసరమని బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జిట్టా రాజేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లబోలు నరసింహారెడ్డి,సోమరాజు వెంకటేష్ రెడ్డి,మండల ఉపాధ్యక్షుడు ఇంద్రకంటి రవీందర్ గౌడ్,బాలరాజ్ యాదవ్,మాసన్న వెంకట్ రెడ్డి,శ్రీశైలం,వరుణ్,ప్రవీణ్‌తో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు

కూకట్ పల్లి, జులై 15, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ జన్మదిన వేడుకలు బుధవారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కమ్మ సంఘం నాయకులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా కమ్మ సంఘం నాయకులు బండి రమేష్ ను ఘనంగా సన్మానించారు. కమ్మ సమాజానికి చేస్తున్న సేవలు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమ్మ సమాజ అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడుతూ శాలువా కప్పి, పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా



అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవలో బండి రమేష్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.
అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ తనపై చూపుతున్న అపారమైన ప్రేమ, ఆదరణ, అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై పీవీఎన్ఆర్ టీవీ వర్సిటీ

# అధికారుల వేధింపులు

### -సంబంధంలేని కేసుల్లో ఇరికించే కుట్ర
### - కోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయని వైనం
### -ప్రశ్నించే గొంతులను తొక్కివేస్తూ మారుమూలలకు బదిలీ
### - మీడియా సమావేశంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రసన్న కుమార్ ఆగ్రహం




కూకట్ పల్లి, జూలై 15, ప్రజా కలం ప్రతినిధి:

ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని పివిఎన్ఆర్ తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రసన్న కుమార్ (ప్రస్తుతం విఆర్ఎస్ తీసుకున్నారు) ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి వ్యక్తుల ప్రోద్బలంతో సంబంధం లేని కేసుల్లో ఇరికించే కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమ మార్గంలో నియమించిన ఇన్చార్జ్ అధికారులను వెంటనే తొలగించి, సీనియారిటీ ప్రకారం అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించడం శోచనీయమన్నారు.

అక్రమాలపై ప్రశ్నిస్తే బదిలీలు:

షెడ్యూల్డ్ కులం (మాదిగ)కు చెందిన తనపైనా, షెడ్యూల్డ్ తెగ (లంబాడ)కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్‌టెన్షన్ – ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నవారు) లపైన, ప్రస్తుతం విధుల్లో ఉన్న మరో ప్రొఫెసర్‌పైన ఉద్దేశపూర్వక, నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ బి ఉదయ్ కుమార్, పరిశోధనా విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ హరి కృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ ఇ సునీల్ ఆనంద్, నాన్–టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ కలిసి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇటీవల తిరిగి విధుల్లోకి చేరిన ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకట రమణ (వెటర్నరీ గైనకాలజీ ఉ అబ్‌స్టెట్రిక్స్ విభాగం) పై ఉద్దేశపూర్వక నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నరన్నారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు జగిత్యాల జిల్లా కోరుట్ల (సీవీఎస్సీ) లోని మారుమూల ప్రాంతానికి బదిలీ చేశారని తెలిపారు.

రిజిస్ట్రార్ కీలక పాత్ర:తనను వేధించడంలో రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర కీలక పాత్ర పోషించారని డాక్టర్ ఆర్ ఎస్ ప్రసన్న కుమార్ ఆరోపించారు. ప్రొఫెసర్ సేవలందించిన తనపై మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె కొండల్ రెడ్డి, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ వి లు కుట్ర పన్నుతున్నారని, రవీందర్ రెడ్డి కారణంగానే 2017–2018లో నేను వరంగల్ జిల్లా మమ్నూర్ కెవికె లో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నప్పుడు తన ప్రొబేషన్ మరియు పదోన్నతి (ప్రమోషన్) నిలిపివేయబడ్డాయన్నారు. తన వల్లే తాను ఆయనకు జూనియర్‌గా మిగిలిపోయానన్నా రు. వీరు (పివిఎన్ఆర్ టీవీయు) లోని 'లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్' విభాగంలోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్నానని, మాజీ ఐపీఎస్ అధికారి ప్రస్తుతం బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోదరుడినని వెల్లడించారు.

చట్టవిరుద్ధం.. ఏకపక్ష చర్య:

పివిఎన్ఆర్ టీవీయు మాజీ వైస్–ఛాన్సలర్ మరియు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బావమరిది అయిన డాక్టర్ రవీందర్ రెడ్డి, రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో 2022లో ఫెబ్రవరిలోని సిఎఫ్ఎస్సి (కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్) అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్‌టెన్షన్) డాక్టర్ బాలాజీ గుగులోతును ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేశారని, హైకోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోలేదని, ఇది చట్టవిరుద్ధం, ఏకపక్ష చర్య అని ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా నాయకుడు సామాజికవేత్త క్రాంతికుమార్, ఎమ్మార్పీఎస్ స్టేట్ నాయకుడు బోయ రమణ, ఎమ్మార్పీఎస్ లీడర్ రమేష్, దళిత మహిళ లీడర్ నికిత, ఓయూ లీడర్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవ వార్డులో సీసీ రోడ్ల గుంతల పూడ్చివేత

## - అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: కౌన్సిలర్ గోలి మమత సంతోష్



గజ్వేల్:15 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్––ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో గల్లీల్లోని సీసీ రోడ్లపై ఏర్పడిన గుంతలను బుధవారం కౌన్సిలర్ గోలి మమత సంతోష్ ఆధ్వర్యంలో సిమెంట్ కంకరతో పూడ్చివేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గోలి మమత సంతోష్ మాట్లాడుతూ, రెండవ వార్డు అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్లపై ఏర్పడిన గుంతలను సొంత ఖర్చుతో పూడ్చించడం జరిగిందన్నారు.ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వార్డు అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర చారి,నేతి శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, గుడాల శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# స్వయంతో.. విద్యకు కొత్త దారి..

## -స్వయం ఉచిత ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన సదస్సు..

పటాన్‌చెరు, జులై 15 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక



స్వయం ఉచిత ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ రాజశ్రీ మోరే మాట్లాడుతూ,డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని, కోర్సు పూర్తిచేస్తే కేంద్ర ప్రభుత్వ గుర్తింపు, అకడమిక్ క్రెడిట్లు లభిస్తాయని తెలిపారు.కళాశాల ప్రధానాచార్యులు ఆర్. వెంకటేశ్వరరావు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వయం కోర్సుల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా. ఉషాకుమారి, డా. కపిల్ రంజన్, అక్షయ్ అంగుల్వాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు..

# సహాయనిధి..పేదలకు చేయూత..

## -సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ.

## పేదలకు అండగా నీలం..

పటాన్‌చెరు, జులై 15 (ప్రజా కలం) ప్రతినిధి

పేదలకు కొండంత అండగా సీఎం సహాయనిధి.. లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన నీలం మధు ముదిరాజ్ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ప్రాణాధారంగా మారిందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం ఎన్ఎంఆర్ శిబిర కార్యాలయంలో ఆయన



అందజేశారు.అమీన్‌పూర్‌కు చెందిన అనసుజకు రూ.60 వేల, గుమ్మడిదలకు చెందిన సీహెచ్ శ్రీనివాస్‌కు రూ.47,500, ఇస్నాపూర్ మున్సిపాలిటీలోని చిట్కుల్‌కు చెందిన సంగన్న కుమారుడు మహేష్‌కు రూ.60 వేల చొప్పున చెక్కులు అందించారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ,ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పెద్ద భరోసాగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని, సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితులకు త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

# 80 తులాల బంగారం, 5.5 కిలోల వెండి చోరీ కేసు ఛేదించిన దుబ్బాక పోలీసులు.

దుబ్బాక ప్రజాకలం జూలై 15.

దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కమిషనర్ రష్మీ పెరుమాళ్ పర్యవేక్షణలో ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సుమారు 400--500 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుడిని గుర్తించారు. తొగుట మండలం లింగంపేటకు చెందిన చిక్కుడు కృష్ణ అలియాస్ వెంగాలి బిక్షపతి (37)ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 80



తులాల బంగారం, 5.5 కిలోల వెండి, రూ.1,300 నగదు, రోల్డ్ గోల్డ్ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు చింత రాజ్‌కుమార్ కుటుంబంతో తీర్థయాత్రకు వెళ్లిన సమయంలో, నిందితుడు ఇంటి కిటికీ ఊచలు వంచి లోపలికి ప్రవేశించి తాళాలతో లాకర్ తెరిచి నగలు, నగదు చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిపై ఇప్పటికే సిద్ధిపేట, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ జిల్లాల్లో 63 చోరీ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు. అలాగే ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు అందించాలని సూచించారు.



## స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, జులై 15, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం అల్మాస్‌గూడలోని తిరుమల నగర్ రోడ్డు నెం. 05లో నిర్వహించిన (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమాన్ని ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. అనంతరం గుర్రంగూడలోని వార్డు కార్యాలయంలో నిర్వహించిన సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, సర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా తయారవుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో మార్పులు, సవరణలు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అనర్హత ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధసూదన్ రెడ్డి,వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్, అలాగే గుర్రం గూడ లోని గుర్రం లింగా రెడ్డి, విష్ణువర్ధన్ రావు, భాస్కర్, ఐలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో ఆషాఢ వేడుకలు..

### - దానిమ్మతోట కాలనీలో ఆనందోత్సాహాలు

### - కుటుంబ సమేతంగా పాల్గొన్న కాలనీవాసులు..సంప్రదాయాలకు పెద్దపీట.



వేములవాడ, జూలై 15 (ప్రజాకలం ప్రతినిధి): ఆషాఢమాసం సందర్భంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు దానిమ్మతోట కాలనీ వాసులు నిర్వహించిన వనభోజనాలు ఉత్సాహంగా జరిగాయి. మహిళలు, చిన్నారులు, యువత, వృద్ధులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరంగా గడిపారు. ఉదయం నుంచే వనభోజన ప్రదేశానికి చేరుకున్న కాలనీవాసులు సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక విందు ఏర్పాటు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు,బంధు మిత్రులతో కలిసి భోజనం చేస్తూ ఆప్యాయతను పంచుకోవడంతో ఆ ప్రాంతం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

కార్యక్రమంలో మహిళలు భక్తిగీతాలు ఆలపించగా, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. యువత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ ఆటలు, వినోద కార్యక్రమాల్లో అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ ఇలాంటి సామూహిక కార్యక్రమాలు పరస్పర ఆత్మీయతను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. రోజువారీ పనుల ఒత్తిడికి దూరంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రకృతి మధ్య గడపడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని పేర్కొన్నారు.

అనంతరం మహిళలు మాట్లాడుతూ ఆషాఢమాసంలో వనభోజనాలు నిర్వహించడం తమ కాలనీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. వనభోజనాల ముగింపులో కాలనీవాసులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందంగా వేడుకలను ముగించారు. ఈ కార్యక్రమం కాలనీలో ఆత్మీయత, ఐక్యత, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా నిలిచింది.

# కుల సంఘాల భవనాలకు త్వరలోనే శ్రీకారం

### - మంజూరైన నాలుగు భవనాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం.

### - మూడో బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన విప్ ఆది



వేములవాడ, జూలై 15 ( ప్రజా కలం ప్రతినిధి ): వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బీసీ భవన్, అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఒక్కో భవనానికి రూ. 1.30 కోట్ల చొప్పున నిధులు మంజూరుకాగా, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికా రులకు సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సౌకర్యాలతో భవనాలను నిర్మిస్తామని పేర్కొన్నారు. అనంతరం తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూడో బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. తిప్పాపూర్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా వెళ్లేందుకు నిర్మిస్తున్న సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వేములవాడ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు తూము మధు ఇప్పపుల అజయ్, కాంగ్రెస్ నాయకులు నాగుల విష్ణు ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా రాష్ట్ర ప్రభుత్వం

### - రూ.19.23 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ.

### - పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా.

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



వేములవాడ, జూలై 15 ( ప్రజా కలం ప్రతినిధి ): ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ. 13.57 లక్షలు, వేములవాడ అర్బన్ మండల పరిధికి చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ. 5.66 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. మొత్తం 55 మంది లబ్ధిదారులకు రూ. 19.23 లక్షల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించడం వల్ల వైద్య ఖర్చుల భారం గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ తూము మధు, ఇప్పపుల అజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుక రమేష్, నాగుల విష్ణు ప్రసాద్, సయ్యద్ సాబీర్, పులి రాంబాబు గౌడ్, షాహిద్ పాషా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలి

### మహేశ్వరం నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

### బీజేపీ,బిఆర్ఎస్ పార్టీల నాయకులు కెఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

### కంటెస్టెడ్ ఎమ్మెల్యే టీపీసీసీ సెక్రెటరీ ఎల్మేటి అమరేందర్ రెడ్డి

మహేశ్వరం, జులై 15, (ప్రజా కలం)

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని మహేశ్వరం నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోగల బాలాపూర్ డివిజన్ (62) జిహెచ్ఎంసి పరిధిలో నుండి తుక్కుగూడ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే,టీపీసీసీ సెక్రెటరీ ఎల్మేటి అమరేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ చొరవతో మాజీ ఎమ్మెల్యే,మహేశ్వరం నియోజవర్గం ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ, బీజేపీ పార్టీల నుండి దొడ్డి శ్రీకాంత్,చింతకింది భాను బోదాస్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో 150 మందికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఎంసీ మాజీ కార్పొరేటర్ బాలు నాయక్,ఎంఎంసి మాజీ కార్పొరేటర్ గజ్జల రామచందర్ గారు, జల్పల్లి పార్టీ ప్రెసిడెంట్ హైమ్మద్ బామ్, కంటెస్టెడ్ ఎంపీటీసీలు గుండోజి వెంకట్ చారి,ఎర్ర సుదర్శన్, రావుల లింగం,వంగేటి మధుసూదన్ రెడ్డి,కొండ శ్రీధర్ రెడ్డి,వరికుప్పల సురేష్(టిల్లు),మేకల కిరణ్,మేకల



మహేందర్,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల కొమురయ్య, గుండ్ల శ్రీశైలం,మైత్రి ఆనంద్ ,మదారి భాస్కర్,గిరి నాయక్,ప్రేమ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

### - హక్కుల సాధనకు టీయూడబ్ల్యూజే నిరంతర పోరాటం

### - వేములవాడలో టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం.



వేములవాడ, జూలై 15 ( ప్రజాకలం ప్రతినిధి ) : జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ, జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడటంతో పాటు వారి సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే నిరంతరం పోరాడుతున్న సంఘమని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి జర్నలిస్టు సభ్యత్వం తీసుకుని సంఘటిత శక్తిని పెంచాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ నాయకత్వంలో టీయూడబ్ల్యూజే జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయించిందని ఆయన గుర్తు చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ఈ సంఘం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం వద్ద బలంగా వాదించి సాధించే దిశగా సంఘం కృషి చేస్తుందని లాయక్ పాషా భరోసా వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరాడితేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ, వృత్తి పరమైన సవాళ్లు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సంఘటిత శక్తి అవసరం మరింత పెరిగిందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా జర్నలిస్టుల్లో ఐక్యత పెంపొందడంతో పాటు వారి హక్కుల సాధనకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం సభ్యులు పాల్గొని సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమం జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు సంఘం మరింత చురుకుగా పనిచేయనున్నదనే సంకేతాలను ఇచ్చిందని పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సి హెచ్ దేవరాజు, కోశాదికారి పంపరి నాగరాజు, ఫహద్,చౌటుపల్లి వెంకటేష్,దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు,జబ్బార్ షబ్బీర్,గంగాధర్, సంటి రాజేందర్, పండుగ స్వామి ఆసిమ్, నవీన్, రాము పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన బడంగ్పేట్ మీర్పేట్ సర్కిల్ సంబంధించిన యువకులు

మహేశ్వరం, జులై 15,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్పేట్ సర్కిల్ మీర్పేట్ సంబంధించిన యువకులు, నాయకులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అర్కల కామేష్ రెడ్డి అవినాష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ నాయకత్వంలో కేటీఆర్ వెనకాల నడవలనే ఉద్దేశంతో అక్షయ్ గౌడ్, రాజు, కార్తీక్, మధు, ప్రణీత్, పల్లె కార్తిక్ గౌడ్, సూర్య చరణ్, వెంకీ, రోహిత్, ఎం ఆనంద్, గని, సాత్విక్, కార్తీక్, చరణ్, అఖిలేష్, విజయ్, శివ, రసూల్, చోటా, శివ, జగదీష్, ఆదిత్య, అన్వేష్, మందీప్, శ్రావణ్, దావీద్, శివ అందరు కూడా వారి వెనకాల ఉన్న టీంతో సహా బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. యువతకైనా, రైతులకైనా మరియు మహిళల కైనా, తెలంగాణ రాష్ట్రానికైనా ఎవరికైనా కూడా కెసిఆర్ గారి నాయకత్వమే శ్రీరామరక్ష అని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరగడంతో కేటీఆర్ గారి పాత్ర కీలకమని అన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్, కేటీఆర్ గార్ల ఉద్యోగులను ఊడగొట్టి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని మాటిచ్చి, అధికారంలోకి రాగానే



కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్ల తోనే ఉద్యోగాలు నింపి వాటినే డబ్బా కొట్టుకుంటున్నాడని, నిజానికి వాళ్ళు ఇచ్చింది 10 వేళా ఉద్యోగాలే అన్నారు.. ఫీజు రియంబర్స్ మెంట్ ఫండ్ రిలీస్ చేయకుండా కాలయాపన చేస్తూ ఈ పతకాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దీప్ లాల్ చవాన్, బిరప్ప, సిద్దాల అంజయ్య, సునీతా బాల్రాజ్, మాధవి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాల్రాజ్, లక్ష్మణ్, లతా శేఖర్, చరణ్, సాయి, బిఆర్ఎస్వి స్టేట్ సెక్రటరీ షేర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో అంబులెన్స్ బీభత్సం

### పలువాహనాలకు ఢీకొట్టిన డ్రైవర్



ఎల్బీనగర్, జూలై 16 ప్రజా కలం ప్రతినిధి:

ఎల్బీనగర్‌లోని సాగర్ రింగ్‌రోడ్డు వద్ద గురువారం మద్యం మత్తులో అంబులెన్స్ నడిపిన డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. సైరన్ మోగిస్తూ మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ అతివేగంగా దూసుకెళ్లి మార్గమధ్యంలో పలు వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం దెబ్బతిన్నాయి.

అదృష్టవశాత్తూ ప్రమాదంలో చిక్కుకున్న వాహనదారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం అనంతరం అంబులెన్స్ డ్రైవర్‌ను ప్రశ్నించిన వాహనదారులతో అతడు దురుసుగా ప్రవర్తించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.




## జూలూరు పిఏసిఎస్ లో దళితులకు స్థానం కల్పించాలి



### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాము కుంట్ల బసవయ్య

భూదాన్ పోచంపల్లి జులై 15 (ప్రజా కలం ) తెలంగాణ రాష్ట్రంలో దళిత ఓట్లు కాంగ్రెస్ కి ప్రథమ స్థానం గా నిలిచాయి. దళితుల ఓట్లతో సీటు దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీకి, దళితులకు అన్యాయం జరుగుతే ఊరుకోము అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాముకుంట్ల బసవయ్య అన్నారు. పోచంపల్లి మండలం జూలూరు పిఏసిఎస్ లో దళితులకు చైర్మన్ లేదా వైస్ చైర్మన్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మొన్న జరిగిన కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పదవులను దళితులను కేటాయించలేదని భువనగిరి నియోజకవర్గంలో దళితుల ఓట్లు కీలకము ఇప్పటికైనా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ తీసుకొని జూలూరు పిఏసిఎస్ లో దళితులకు స్థానం కల్పించాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ దళితులు ఓట్లతోనే రాజ్యాధికారం సాధించిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాము కుంట్ల బసవయ్య అన్నారు.



## కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 15 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అర్హులైన 18 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావ్ మాట్లాడుతూ .... పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కవిత ఆషాఢ మాసం సెంటిమెంట్,

## 23 అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ ఛార్జీల నియామకం

### లక్కీ నంబర్ '5' కలిసి వస్తున్న నమ్మకం, బీసీలకు అగ్రతాంబూలం.. సగానికి పైగా స్థానాలన కేటాయింపు




**హైదరాబాద్,జులై 15: ప్రజా కలం ప్రతినిధి**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక అడుగు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత కింద 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇన్ ఛార్జీలను నియమిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆషాఢ మాసంలో మంచి ముహూర్తాన్ని చూసుకొని ఈ ప్రకటన చేయడం విశేషం. పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఈ తొలి నియామకాల్లో కవిత తన లక్కీ నంబర్ ఐదు (2౦3 = 5) సెంటిమెంట్ ప్రతిబింబించేలా 23 స్థానాలకు ఇన్ ఛార్జీలను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.

బీసీ నేతలకు పెద్దపీట:

విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లోనూ బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమిస్తున్న తెలంగాణ రక్షణ సేన, నియోజకవర్గ ఇన్ ఛార్జీల ప్రకటనలో బీసీలకే అగ్రతాంబూలం ఇచ్చింది. మొత్తం 23 స్థానాలలో సగానికి పైగా అంటే 12 స్థానాలను బీసీ నేతలకే కేటాయించి తన నిబద్ధతను చాటుకుంది. అలాగే ఐదుగురు ఎస్సీలు, ఒక ఎస్టీ, ఆరుగురు ఓసీ నేతలకు ఈ జాబితాలో అవకాశం కల్పించారు.

ప్రజల్లో ఉంటూ పోరాడాలి – కల్వకుంట్ల కవిత పిలుపు:

నియోజకవర్గాల ఇన్ ఛార్జీల నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత, నూతన ఇన్ ఛార్జీలకు దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని సూచించారు. పార్టీ ఆశయాలైన పాంచజన్య సిద్ధాంతాన్ని ప్రతి గడపకూ చేరవేసి, తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలకు దశలవారీగా త్వరలోనే ఇన్ ఛార్జీలను ప్రకటిస్తామని ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు స్పష్టం చేశారు.

## ఈత వనం కార్యక్రమంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 15 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని



మాచాపూర్ గ్రామంలో బుధవారం ఈత వనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్రావు ఎక్సైజ్ అధికారులు, గౌడ కులస్తులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి రెండవ దశ మార్కెట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ మత్స్యగిరి ఆలయంలో హుండీ లెక్కింపు

### - 124,రోజులకు గాను 15,27,272/రూపాయల ఆదాయం

వలిగొండ జూలై 15 ప్రజాకలం:మండల పరిధిలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్లగొండ వారిచే డిప్యూటీ చేయబడిన ఏడుకొండలు జూనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణలో,ఆలయంలోని హుండీలు లెక్కించగా 124 రోజులకు గాను 15,27,272/పదిహేను లక్షల,ఇరవై ఏడు వేల,రెండు వందల డెబ్బై రెండు రూపాయలు,నిత్యాన్నదాన 4,803/ రూపాయల ఆదాయం,శ్రీ స్వామివారి కల్యాణ కట్నాలు 28,623/ రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కే. వెంకటయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నెకంటి కలమ్మ యాదయ్య,వేద పండితులు,కెనరా బ్యాంక్ మేనేజర్ అంజనీ కుమార్,సిబ్బంది,శ్రీ వారి సేవా సమితి సభ్యులు,సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) రాష్ట్ర కార్యాలయం ప్రారంభం నేడు.

ప్రజాకలం/జగద్గిరిగుట్ట (ప్రతినిధి) జూలై 15:

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) హైదరాబాద్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్‌లోని



బాలకృష్ణ హైస్కూల్ ఎదురుగా ఉన్న ప్లాట్ నెం.90లో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు రాందాస్ బండు అథవాలే ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు కాంబ్లే రాజేష్ ఆహ్వానం పలికారు. సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పార్టీ మరింత బలోపేతంగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.



# మీ ఓటు మీదే బాధ్యత..

## ఎస్ఐఆర్ పై అలసత్వం వద్దు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కన్నన్ హెచ్చరిక

### ఫామ్ నింపి, బీఎల్ఓలకు అందించండి..గడువు ముగిస్తే ఏం చేయలేము..

**హైదరాబాద్,జులై 15: ప్రజా కలం ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు బాధ్యతగా పాల్గొనాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కన్నన్ స్పష్టం చేశారు.నగర ప్రజలందరూ తమ ఓటు హక్కును బాధ్యతగా భావించి, ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి ఆయన కీలక మార్గదర్శకాలతో పాటు గడువు వివరాలులను ఆయన వెళ్ళడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాబోయే డ్రాఫ్ట్ లిస్ట్‌లో కచ్చితంగా పేరు ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు.

జులై 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం

కొత్త ఓటు నమోదు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24 చివరి తేదీ అని కమిషనర్ స్పష్టం చేశారు. జులై 10 నాటికి 1.5 లక్షల దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 80 శాతం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే పూర్తయినట్లు తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం 25.52 శాతానికి చేరిందని, ఇంకా 23 లక్షల మందిని ఈ ప్రక్రియ పరిధిలోకి తీసుకురావాల్సి ఉందన్నారు. ఫామ్ సమర్పించడం అత్యంత ముఖ్యమని, ఏవైనా తప్పులుంటే తర్వాత సవరించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో గడువులు ఇవే:

జులై 24: ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ.

జులై 31: ఓటర్ల ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రకటన.

జులై 31 నుండి ఆగష్టు 30 వరకు: ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సవరణల స్వీకరణ.

సెప్టెంబర్ 20: వచ్చిన సవరణల దరఖాస్తులన్నింటినీ పూర్తిగా పరిష్కరించడం.

అక్టోబర్ 1: ఓటర్ల తుది (ఫైనల్) జాబితా అధికారిక ప్రకటన.

ఫామ్ నింపేవిధానం...

2002 ఎన్నికల సమయంలో ఓటు వేసిన వారు తమ ఓటు వివరాలను వెతికి ఫామ్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఒకవేళ కొత్త ఓటర్లు అయితే తమ తల్లిదండ్రుల పాత ఓటు వివరాలను ఇవ్వాలి. దీనితో పాటు ఓటరు ఆధార్ కార్డు, తల్లిదండ్రుల మొబైల్ నంబర్లను ఫామ్‌తో తప్పనిసరిగా జత చేయాలన్నారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ఫాం ఎలా నింపాలో పూర్తి వివరాలను స్టెప్ బై స్టెప్ వివరాలను యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ద్వార అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఫామ్ కోసం



స్థానికంగా బీఎల్ఓలు అందుబాటులో ఉన్నారని, వారి సంప్రదించేలా ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్ పరిధిలో మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు.

క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు.. పార్టీ నేతలతో సమావేశం

ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ వివరించారు. 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీలు గరిష్టంగా 50 ఫామ్‌లను సేకరించి ఇచ్చేందుకు వీలు కల్పించామన్నారు. ఈ ప్రక్రియపై వారం రోజుల్లో అన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఇక ఓటరు నమోదుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఆటోలు, రిక్షాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎల్ఓ సిబ్బంది రాత్రింబవళ్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, బీఎల్ఏ లతో కలిసి సమన్వయంతో పనిచేస్తు న్నారని తెలిపారు. ఉన్నతాధికారులు ప్రతి రెండు గంటలకు ఒకసారి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారని, ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ మొత్తాన్ని పకడ్బందీగా పూర్తి చేస్తామని కమిషనర్ ధీమా వ్యక్తం చేశారు.

# కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫోటో ముద్రించాలి

## కేంద్ర మంత్రి రాందాస్ అఠవలేకు CAPSS వినతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 15:

భారత కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఫోటోను ముద్రించాలనే డిమాండ్‌పై కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ



మంత్రి రాందాస్ అఠవలే సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని తానే స్వయంగా దేశ ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, అలాగే ప్రధానితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముంబైలోని బాంద్రాలో గల కేంద్రమంత్రి నివాసం 'సంవిధాన్'లో మంగళవారం సాయంత్రం 'కరెన్సీ పై అంబేడ్కర్ ఫోటో సాధన సమితి' ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురాం మాట్లాడుతూ.. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫోటో సాధన కోసం తాము గత 16 ఏళ్లుగా దేశవ్యాప్తంగా నిరంతరాయంగా ఉద్యమం నిర్వహిస్తున్నామని మంత్రికి సవిస్తరంగా వివరించారు.

ఈ ఉద్యమ ప్రాధాన్యతను, ప్రజల సెంటిమెంట్‌ను అర్థం చేసుకున్న కేంద్రమంత్రి అఠవలే సానుకూలత వ్యక్తం చేస్తూ, ఈ విషయాన్ని పీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్తానని బృందానికి నమ్మకం ప్రకటించారు. ఈ భేటీలో సాధన సమితి నాయకులు జె.నర్సింగరావు మహరాజ్, ఎల్ది రఘునాథ్ పద్మశాలి, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి

## - శివ్వాపూర్‌లో రూఫ్‌టాప్ రేయిన్ హార్వెస్టింగ్ పిట్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 15 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని శివ్వాపూర్ గ్రామంలో రూఫ్‌టాప్ రైన్ హార్వెస్టింగ్ పిట్ నిర్మాణానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వర్షపు నీటి ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకోవడం నేడు ఎంతో అవసరమన్నారు. భూగర్భ జలాల పరిరక్షణకు రైన్ హార్వెస్టింగ్



అత్యంత సమర్థవంతమైన మార్గమని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ రైన్ హార్వెస్టింగ్‌ను ఒక జలయజ్ఞంలా భావించి తమ ఇళ్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో రైన్ హార్వెస్టింగ్ పిట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయడం మనందరి బాధ్యతని, ప్రతి ఇంట్లో రైన్ హార్వెస్టింగ్ పిట్ నిర్మించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించి నీటి వనరులను కాపాడుకోవచ్చన్నారు. నీటి సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ఇది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తానికి సంబంధించిన ఉద్యమమని ఎమ్మెల్యే అన్నారు. శివ్వాపూర్‌లో ప్రారంభించిన ఈ రైన్ హార్వెస్టింగ్ పిట్ గ్రామానికి ఆదర్శంగా నిలిచి, ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె నాగరాజు, ఉపసర్పంచ్ వడ్డే నర్సింలు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 15 ప్రజా కలం : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామ నివాసి సంబరం రాములు (65) మతిస్థిమితం సరిగా లేక బుధవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్సై ఎన్ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం ఉదయం సుమారు 10:30 గంటలకు ఇంటి నుండి వెళ్ళిన రాములు తిరిగి ఎంతకు ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య లక్ష్మి, గ్రామస్తులు అతడి ఆచూకీ కోసం గాలిస్తుండగా గ్రామ చెరువు వద్ద చెప్పులు కనిపించాయి. అనంతరం చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం సుమారు ఆరున్నర గంటలకు రాములు మృతదేహం లభించింది. మృతుడు గత కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అతడి భార్య లక్ష్మి ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్ర ప్రభుత్వ PM RAHAT & PM RAH-VEER పథకాలపై ప్రజలకు అవగాహన : పోలీస్ కమీషనర్ వెల్లడి




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 15: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడడంతో పాటు , ప్రమాద బాధితులకు సహాయం చేసే పౌరులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (వీశీ=ుఎ) ఆధ్వర్యంలో ూవీ =ూనాూ మరియు ూవీ =ూఎ-ఎజుజు= పథకాలను అమలు చేస్తోంది. ఈ రెండు పథకాల ప్రధాన ఉద్దేశ్యం గోల్డెన్ అవర్‌లో రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించి ప్రాణాలను రక్షించడం మరియు ప్రజల్లో మానవత్వాన్ని , బాధ్యతాయుతమైన స్పందనను పెంపొందించడం.

PM RAHAT పథకం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన అర్హులైన బాధితులకు ?1.5 లక్షల వరకు ఉచిత క్యాష్‌లెస్ వైద్యం లేదా ప్రమాదం జరిగిన తేదీ నుండి గరిష్ఠంగా 7 రోజుల వరకు ఉచిత చికిత్స అందించబడుతుంది.

PM RAHAT ముఖ్యాంశాలు

1) 1.5 లక్షల వరకు ఉచిత క్యాష్‌లెస్ వైద్యం.

2) లేదా 7 రోజుల వరకు ఉచిత చికిత్స.

3) ప్రభుత్వం గుర్తించిన ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో చికిత్స.

నిజామాబాద్ జిల్లాలో పైలట్ ఆసుపత్రులు

1) మనోరమ హాస్పిటల్, నిజామాబాద్

2) ప్రగతి హాస్పిటల్, నిజామాబాద్

PM RAH-VEER పథకం

రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలు (Grievous Injury) పొందిన బాధితులకు గోల్డెన్ అవర్‌లో సహాయం చేసి , సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చేసిన వ్యక్తిని "రాహ్-వీర్"గా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ?25,000 నగదు ప్రోత్సాహకం అందజేస్తుంది.

eDAR పాత్ర

రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను eDAR (Electronic Detailed Accident Report) ద్వారా నమోదు చేసి, పోలీస్ శాఖ, రవాణా శాఖ, ఆరోగ్య శాఖ, ఆసుపత్రులు, బీమా సంస్థలు మరియు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలను వేగవంతంగా చేపడతాయి.

ప్రజలకు విజ్ఞప్తి

రోడ్డు ప్రమాద బాధితుడిని చూసిన వెంటనే భయపడకుండా సహాయం చేయండి. సమయానికి అందించిన సహాయం ఒక ప్రాణాన్ని కాపాడగలదు. "గోల్డెన్ అవర్‌లో అందించే సహాయం ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. రోడ్డు ప్రమాద బాధితుడికి వెంటనే సహాయం చేయండి. 112/100/108కు సమాచారం అందించండి. మీరు కూడా ఒక 'రాహ్-వీర్' అవ్వండి.'' నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., తెలిపారు.

# దినకర్మ సామాగ్రి తీసుకు వస్తుండగా

## - గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం









కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 15 ప్రజా కలం : దినకర్మ సామాగ్రి తీసుకువస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ హృదయ విదారకర ఘటన నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. నిజాంసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోర్గల్ గ్రామానికి చెందిన జుంజురు దినేష్(26), జుంజురు రమేష్(24) అనే ఇద్దరు యువకులు దినకర్మ సామాగ్రి కోసం పిట్లం వెళ్లి తిరిగి బైక్?పై వస్తుండగా వడ్డేపల్లి శివారులోని కంకర మిషన్ వద్ద వీరి బైక్?ను గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో జుంజురు దినేష్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రమేష్?ను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్సై శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం గాలిస్తున్నారు.

ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డి వస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రమాద స్థలం వద్ద ఆగి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రైవేట్ స్కూల్స్ భద్రతకు పోలీసుల భరోసా

## విద్యార్థుల రక్షణ కోసం డీసీపీ, ఏసీపీని కలిసిన బనాల విజయేందర్ రెడ్డి టీం




ఉప్పల్ జూలై 15(ప్రజాకలం న్యూస్)

ప్రైవేట్ పాఠశాలల్లో నకిలీ ఐడీ కార్డులతో ప్రవేశించి సిబ్బందిని బెదిరించడం, అక్రమంగా డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలను అరికట్టాలని ఉప్పల్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు పోలీసులను ఆశ్రయించాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ల తరఫున బనాల విజయేందర్ రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేష్ కుమార్, ఏసీపీ వెంకటరెడ్డిలను కలిసి సమస్యలను వివరించారు. ఇటీవల కొందరు వ్యక్తులు తమను ప్రైవేట్ యూనియన్ సభ్యులుగా పరిచయం చేసుకుంటూ నకిలీ గుర్తింపు కార్డులతో పాఠశాలల్లోకి ప్రవేశించి సిబ్బందిని బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని విజయేందర్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ చర్యల వల్ల 3 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల్లో భయాందోళనలు నెలకొని, విద్యా వాతావరణం దెబ్బతింటోందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వివరించారు. సమస్యలపై స్పందించిన డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ వెంకటరెడ్డి స్కూల్ యాజమాన్యం ముందస్తు అనుమతి లేకుండా ఏ స్టూడెంట్ యూనియన్ గానీ, ఇతర వ్యక్తులు గానీ పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ప్రవేశించి బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్కూల్ గేట్ల వద్ద అధికారిక హెచ్చరిక నోటీసులు ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. ఈ సమావేశంలో ఉప్పల్ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు వెంకటేశ్వర్ రావు, సతీష్, షేక్ మదార్, శ్రీధర్, ఉపేందర్, కిరణ్ కుమార్, ధన్ సాగర్, అల్తాఫ్, చందన, లక్ష్మీ దేవమ్మ, నందిని, కబీర్, జోషి, సుధాకర్ రెడ్డి, సందీప్, రాజు, శ్రీనివాస్, తిమోతి, సందీప్ కె, రాజు కె తదితరులు పాల్గొన్నారు.

# మోర్తాడ్‌లో ఘనంగా కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ 2వ వర్ధంతి సభ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 15:

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) అనుబంధ విభాగమైన అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (AIPKMS) ఆధ్వర్యంలో బుధవారం మోర్తాడ్ మండల కేంద్రంలో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అన్న 2వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా AIPKMS జిల్లా అధ్యక్షులు జి.కిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేవలం తన సొంత స్వార్థం చూసుకోకుండా, సమాజంలోని బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన అరుదైన నిస్వార్థ




నాయకుడు కామ్రేడ్ చంద్రశేఖర్ అని కొనియాడారు.

సమాజంలో విప్లవాత్మక మార్పు రావాలనే ఆశయంతో ఆయన చివరి శ్వాస వరకు పనిచేశారని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, గిరిజనులను ఏకం చేసి అనేక భూ పోరాటాలను ముందుండి నడిపిన వీరుడు చంద్రశేఖర్ అని కిషన్ కొనియాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని ఆయన ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. కోవిడ్ క్లిష్ట సమయాల్లో సైతం లెక్కచేయకుండా ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటంలో చంద్రశేఖర్ అన్న పాల్గొని తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారని అభినందించారు. చంద్రశేఖర్ అన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని, ఆయన చూపిన పోరాట బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం (AIPKMS) నాయకులు దయాల్ సింగ్, బాజన్న, లత, గంగాదర్, చిన్నమ్మ, గంగం, చిన్నక్క, రాజేశ్వర్, పోశెట్టి, గంగరాం, చిన్న రాజన్న, ముకుందం, శోభన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 15 ప్రజా కలం : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11 వ, 12 వ వార్డులలో 80 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ



రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. వర్షా కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ వార్డుల్లో సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, వార్డు ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంకెఎఫ్ ట్రస్ట్ అండ: రోడ్డు ప్రమాద బాధితుడికి రూ. 5వేల ఆర్థిక సహాయం

నిజామాబాద్, ప్రజా కలం ప్రతినిధి:

సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఎంకెఎఫ్ ట్రస్ట్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. మోర్తాడ్ మండలం మోర్తాడ్ గ్రామానికి చెందిన సిర్నాపల్లి వినీత్ అనే యువకుడు ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తూ ఒక కాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంకెఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులు బాధితుడి నివాసానికి వెళ్లి, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో అధైర్యపడకుండా ఉండాలని కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ట్రస్ట్ తరపున రూ. 5,000/- (ఐదు వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రం సాయి చందర్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు జక్కం అశోక్, అలలా రాజ్ కుమార్, రాజా శేఖర్, ఒళ్ళెం చంద్రమోహన్, మరియు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రమాదాల బారిన పడి విపత్కర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం తమ ప్రాథమిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి వర్గాలకు భవిష్యత్తులోనూ ఎంకెఎఫ్ ట్రస్ట్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. వినీత్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న ట్రస్ట్ సభ్యుల చొరవను స్థానికులు ఎంతగానో అభినందించారు.



## పేద, మధ్యతరగతికి ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

# విద్య, వైద్యం కోసం ఎంత ఖర్చైనా భరిస్తాం

**-ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన**

**-మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**

మహేశ్వరం, జులై 15,(ప్రజా కలం)

పేద, మధ్యతరగతికి ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరం అని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మహేశ్వరం నియోజకవర్గం



కందుకూరు మండలానికి చెందిన ఇద్దరికి చెక్కులు అందజేశారు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రిపాలైన కొత్తూరుకు చెందిన కర్నాటి బలరామ్ కు రూ. 1.75 లక్షల ఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక నాయకలతో కలిసి కె ఎల్ ఆర్ అందజేశారు. అనంతరం మరో రూ. 60 వేల చెక్కును తిమ్మాపూర్ కు చెందిన దొడ్డె మల్లేషంకు కిచ్చెన్నగారు ఇచ్చారు. ఈ సందర్భంగా తుక్కుగూడ కార్యాలయంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులతో పేద రోగులకు చికిత్స అనంతరం ఆర్థికంగా ఆసరా అవుతున్నాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో పేదల సంక్షేమం, విద్య, వైద్యం కోసం ఎంత ఖర్చైనా వెనుకడటం లేదన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం, చికిత్స అనంతరం సి ఎం ఆర్ ఎఫ్ చికిత్స కోసం ఎల్ ఓ సి ద్వారా లక్షాలది మంది పేద, మధ్య తరగతి రోగులను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని కె ఎల్ ఆర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా కందుకూరు మండల నాయకులు బొక్క జంగారెడ్డి, సరికొండ మల్లేష్, మహేశ్ గౌడ్, రాణా ప్రతాప్ రెడ్డి, శేఖర్, సరికొండ జగన్, పాండు, ఏఎంసీ డైరెక్టర్ సురేందర్, వార్డు మెంబర్ నరసింహా సహా పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.






# ఆలీకేఫ్ ఎక్స్ రోడ్ మహంకాళి వైన్ మార్ట్ తో ప్రజల బేజారు



**- పాదాచారులకు,వాహనదారులకు ఇబ్బందిగా మారిన వైన్ షాప్...**

**- పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం**

**అంబర్పేట్ జూలై 14(ప్రజాకలం న్యూస్)**

అంబర్పేట్ ఆలీకేఫ్ చౌరస్తా నుండి న్యూ దుర్గానగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శ్రీ మహంకాళి వైన్ మార్ట్ తో ప్రజలు వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పోలీసులు,ట్రాఫిక్ పోలీసులు,ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రాగడానికి వచ్చిన వారు,మద్యం కొనుగోలుకు వచ్చిన వారు ఎక్కడ పడితే అక్కడ రోడ్డును మొత్తం ఆక్రమించి వాహనాలు నిలపడంతో ఆ దారిన రాకపోకలు సాగించే వారు అసౌకర్యానికి లోనౌతున్నారు. దీనికితోడు త్రాగుబోతులు మద్యం సేవించి రోడ్లపైనే పడుకోవడం దారిన పోయే మహిళలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైన్ షాప్ ను ఇక్కడ నుండి వేరే చోటికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆలీకేఫ్ చౌరస్తా నుండి దుర్గానగర్ వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారిపై ఉన్న మహంకాళి వైన్ మార్ట్ ప్రజలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా మహిళలు ఆ దారిన వెళ్లాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. మద్యం సేవించి దారిన వచ్చి పోయే వారికి వికృత చేష్టలతో అసౌకర్యం కల్గి స్తున్నారు. పోలీసులు,ట్రాఫిక్,ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వాళ్లు ప్రజల సమస్యలు గుర్తించి ఈ వైన్ మార్ట్ ను ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం.



మహమ్మద్ హుస్సాముద్దీన్
కాంగ్రెస్ పార్టీ
సీనియర్ నాయకులు అంబర్పేట్

# డబుల్ ఓటు రాజకీయం

## సీఎం రేవంత్ రెడ్డి పై నమోదు చేసి, జైలుకు పంపాలి

**ఆధారాలను బయటపెట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**కొడంగల్ ఎన్నికను రద్దు చేయాలని డిమాండ్**



**హైదరాబాద్,జులై 15: ప్రజా కలం ప్రతినిధి**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని, చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఆయన పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి, జైలుకు పంపాలని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

బుధవారం తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డికి రెండు నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్న విషయాన్ని ఆధారాలతో సహా బయట పెట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సొంత ఊరైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో సీరియల్ నెం. 601, అలాగే కొడంగల్ నియోజకవర్గంలో సీరియల్ నెం. 974, ఒకే ఎపిక్ నెంబర్ (ఒజుూ0274035) తో రెండు ఓట్లు ఉన్నాయని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 17, 18 ప్రకారం ఎవరికీ రెండు చోట్ల ఓటు హక్కు ఉండకూడదని, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే సెక్షన్ 31 ప్రకారం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశముందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ ఇచ్చి పోటీ చేశారని, అందుకే ఆయన కొడంగల్ ఎన్నికను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో నటుడు ప్రకాష్ రాజ్పై ఇలాంటి కేసు పెట్టినప్పుడు, సీఎం రేవంత్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు.

**అర్ధరాత్రి అధికారుల వివరణ,తొలగింపు..**

ఈ అక్రమాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బదులు, సీఎం ఆఫీస్ ఆధ్వర్యంలోని ఫాక్ట్ చెక్ సంస్థ రాత్రికి రాత్రే సోషల్ మీడియాలో వివరణ ఇచ్చి ఆ తర్వాత డిలీట్ చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి ఓటు లేదని చెబుతున్న నాగర్ కర్నూల్ కలెక్టర్, రేవంత్ సంతకం లేకుండా ఫామ్ 7, ఫామ్ 8 లేకుండా ఓటును ఎలా తొలగించారో సమాధానం చెప్పాలన్నారు. లేదంటే కలెక్టర్ పై ఆధారాలు నాశనం చేసిన నేరం కింద నిందితుడవుతారని హెచ్చరించారు. ఇదే విషయమై తాము కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

**కాంగ్రెస్ నేతల అండతోనే...**

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, షాబాద్ పోక్సో కేసు నిందితుడికి కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకుడే బెయిల్ ఇప్పించడమే కాకుండా, కేంద్ర మంత్రి కొడుకుకు మేడ్చల్ కోర్టులో రహస్యంగా బెయిల్ ఇప్పించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులను కాకుండా నిందితులను కాపాడుతోందని, బండి సంజయ్, గువ్వల బాలరాజులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి తనపై కుట్రలు పన్నుతున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కల్వకుర్తి శ్రీనివాస్ యాదవ్, గౌతమ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## మిథిలా నగర్లో రూ.40 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్(ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మిథిలా నగర్లో ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్ల అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం (సీఎంసీ) నిధుల నుంచి రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో రోడ్ నెం.8 (వాటర్ ట్యాంక్ ఎదురుగా) రోడ్ నెం.14 (నారాయణ స్కూల్ ఎదురుగా) రోడ్ల అభివృద్ధి చేపట్టనున్నారు. ఈ నిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల



శ్రీధర్ బాబు సహకారంతో, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషి ఫలితంగా మంజూరైనట్లు స్థానికులు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో మహాదేవపురం అధ్యక్షులు సిద్ధనొళ్ల సంజీవరెడ్డి, బహదురుపల్లి అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, మిథిలా నగర్ కల్చరల్ అసోసియేషన్ (వీజూా) సభ్యులు కృష్ణా రెడ్డి, ప్రవీణ్ జడ్డూ, జనార్ధన్ రెడ్డి, శివాజీ, భీమేష్, ధనుంజయ్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, విజయ్ రెడ్డి, బజ్జీ, నాగరాజు, సురేష్, సాత్విక్, విజయ్, వాలి, దిలీప్, తిరుమల, రాజశేఖర్, వెంకటేశ్వర్లు రెడ్డి, సందీప్, సతీష్, గోనా రెడ్డి, సంతోష్, సుబ్బు, సురేంద్ర, వెంకట్ రావు తదితరులు, ఆర్.కె. టౌన్షిప్, మిథిలానగర్, శిల్పా లేఅవుట్ నివాసులు పాల్గొన్నారు.

## 28న జరగబోయే సాంస్కృతిక బోనాల జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన సీజీఎన్ కల్చరల్ అసోసియేషన్ బృందం.

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

తెలంగాణ ఆషాఢ మాస బోనాల జాతర సంప్రదాయాలను కనుల పండుగగా నిర్వహించాలని ఈ నెల 28న సీజీఎన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజర్ సందీప్ నేతృత్వంలో భారీ సాంస్కృతిక బోనాల జాతర నిర్వహించనున్నట్లు అసోసియేషన్



వ్యవస్థాపకుడు సందీప్ తెలిపారు. బుధవారం కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. బోనాల జాతర విశిష్టతను ప్రతిబింబించేలా సంప్రదాయ బోనాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈజాతరను కొంపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సాంస్కృతిక బోనాల జాతరను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో హేమంత్, కార్తీక్, మహేష్, నందిని, మమతా, సునీత, చంద్రశేఖర్,అనిల్ లు పాల్గొన్నారు

# రాజకీయ వ్యూహం..

## తెలంగాణ రాష్ట్రంలో కేటీఆర్ పాదయాత్ర

## అధికారంలోకి బీఆర్ఎస్,సీఎంగా కేసీఆర్

## అధికారంకు దూరంకాన్ను కాంగ్రెస్ ,బీజేపీ ఆశలు గల్లంతు

**హైదరాబాద్, జులై 15: ప్రజా కలం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనల పై ప్రజల్లో రోజురోజుకు నమ్మకం సన్నగిల్లుతోందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు జోస్యం చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించి తన మనసులోని మాటలను బయటపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పరిపాలన, భవిష్యత్తు కార్యాచరణ పై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. వచ్చే ఏడాదిలో పాదయాత్ర ఉంటుందని, అందుకు కావల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ పాదయాత్రతో బీఆర్ఎస్ ప్రజలకు మరింత దగ్గర అవుతుందన్నారు. ఇక ప్రజా సమస్యలను ఎత్తిపట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. ఇక ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వాన్ని నిలదీస్తు, పోరాటం చేస్తూ, వారి తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసి హామీలు, నిధులు, నీళ్లు, ప్రాజెక్టు ల పై ప్రశ్నల వర్షం కురిపించారు. దీనితో ఆయనే స్వయం గా సమాధానం చెప్పాల్సి వచ్చిందన్నా రు. ఇక రైతుల కోసం రక్తం చిందించినట్లు తెలిపిన ఆయన సాగుకోసం నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**భవిష్యత్తు బీఆర్ఎస్.. కేసీఆర్ సీఎం**

తెలంగాణాలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేసీఆరే ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హస్తం పార్టీ అంటేనే ప్రజలు ఛీ కొట్టే పరిస్థితులు తప్పడం లేదన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలను తరిమికొట్టే



స్థాయికి చేరారని వెల్లడించారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ, రేవంత్ పాలన పై స్వయంగా సర్వే చేసుకున్న ఆయన దిమ్మతిరిగిపోయేలా షాక్ ఇచ్చాయన్నారు. మరోవైపు కాంగ్రెస్ హస్తం ఏ క్షణంలోనైనా పడిపోతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కళ అన్నారు..ఒకటి కాదు రెండు కాదు,ఏకంగా మూడు సర్వే ఏజెన్సీలతో సర్వే చేయించారని ఆ సర్వేలు సైతం బీఆర్ఎస్ కే పట్టం కట్టారని వెల్లడించారు. సగం పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధాయువుతో ముగిస్తుందా? లేక దినదిన గండం, నూరేళ్ల ఆయుష్య అన్నట్లు సాగుతుందా అన్నది తెలయదన్నారు. ఒక వైపు కాంగ్రెస్ లో కుమ్ములాటలు సైతం పార్టీని, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టినట్లు వెల్లడించారు. సీఎం రేవంత్ సర్వేలు బీఆర్ఎస్ కు కలిసివచ్చాయని ధీమా వ్యక్తం చేశారు. దీనితో బీఆర్ఎస్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయని చెప్పకతప్పదు..

## వలిగొండ పిఏసిఎస్ చైర్మన్ గా గరిసే రవి



వలిగొండ జులై 15 ప్రజాకలం:వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం,పిఏసిఎస్ కు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పర్సన్ ఇన్చార్జి (పిఐసి) కమిటీని నియమించింది. కొత్త కమిటీ చైర్మన్ గా గరిసె రవిని నియమించారు. ఈ సందర్భంగా గరిసె రవి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి,నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పాల్గొన్న కౌన్సిలర్ గోలి మమత సంతోష్

గజ్వేల్:15 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని రెండవ వార్డులో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో కౌన్సిలర్ గోలి మమత సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును సంరక్షించుకోవాలని, ఓటరు జాబితాలో పేరు ఉండేలా బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఇప్పటివరకు సుమారు 65 శాతం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తైందని, ఇంకా మిగిలిన వారు వెంటనే తమ ఎన్యుమరేషన్ ఫారమ్‌లను నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర చారి, నేతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## హెచ్‌పీసీఎల్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం

గజ్వేల్:15 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్




ఆధ్వర్యంలో జయంతి పునరావాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ రాహుల్ మాట్లాడుతూ, సంస్థ వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందిస్తూ విశ్వసనీయ సేవలు అందిస్తోందన్నారు. హెచ్‌పీసీఎల్ ఇంధనంపై వినియోగదారులు విశ్వాసం, సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ సమాజానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ రాహుల్‌తో పాటు భక్త పాల్, భరత్, ప్రశాంత్, కిరణ్, ప్రసాద్, శంకర్, మణిదీప్, నందకిషోర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్పల్లి చంద్రంను మర్యాదపూర్వకంగా కలిసిన టిపిసిసి సాంస్కృతిక సేన జిల్లా కమిటీ సభ్యులు.

దుబ్బాక ప్రజాకలం జూలై 15.

టిపిసిసి సాంస్కృతిక సేన సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు



జిల్లా అధ్యక్షుడు కళాప్రసాద్, ప్రధాన కార్యదర్శి బండకాడి గణేష్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధర్పల్లి చంద్రంను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో నిర్వహించనున్న టిపిసిసి సాంస్కృతిక సేన సిద్దిపేట జిల్లా శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు చేరువపు యాదగిరి, సిరియాల్ సోమ, నరేష్, ప్రశాంత్, కళ్లెం లక్ష్మణ్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బీజేపీ నేతల పరామర్శ - బియ్యం, నగదు ఆర్థిక సాయం

గజ్వేల్:15 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని 17వ వార్డుకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త స్వరాజ్యలక్ష్మి కుటుంబంలో ఆడపడుచు అకాల మరణం చెందడంతో, బీజేపీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు రూ. 5,000 నగదు ఆర్థిక సాయాన్ని అందజేసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ కార్యకర్తలు ఉప్పల మధు సుధన్, చిలివేరి జనార్దన్, పెండ్యాల శ్రీనివాస్, మార్కంటి ఏగొండ, నాగులాపల్లి పవన్, కాశబోయిన రమేష్, కాశమైన నవీన్ కుమార్ నాయకులు పాల్గొని మృతురాలికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



# టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ పోలీసులు

శంషాబాద్, జులై 15,(ప్రజా కలం)

టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఫిర్యాదుదారుడి అక్క రష్మిత, వయస్సు: 35 సం.లు అను ఆమె మరియు మా బావ ఖిరా సింధు ప్రభోయ్ బుద్దుడు ప్రభోయ్ 44 ఇయర్స్ , డ్రైవర్ ,బేలార్ధన విలేజ్ , సియాలాటి పోస్ట్ , కోమన, నౌపడ జిల్లా ఒడిశా స్టేట్ అను వారు దాదాపు మూడు సంవత్సరాల క్రితం మా ఊరి నుండి బతుకు దెరువు నిమిత్తం వారి సొంత ఊరి నుండి వల వచ్చి, ఇక్కడ శంషాబాద్ వద్ద గల కొత్వాల్ గూడ నందు నివాసం ఉంటూ మల్లేశ్ అను అతని వద్ద డ్రైవింగ్ చేసుకుంటూ జీవిస్తున్నా తేదీ 13 న నాడు సాయంత్రం అందాజ 04:30 గంటల సమయంలో ఫిర్యాదుదారుడి అక్క రష్మిత ఫిర్యాదుదారుడి కు ఫోన్ చేసి, బావకి ఆక్సిడెంట్ జరిగి కుడి కాలికి బలమైన రక్త గాయం అయింది. అని చెప్పి, ఫిర్యాదుదారుడు ని వెంటనే బయలుదేరి రమ్మని చెప్పగా ఫిర్యాదుదారుడు తేదీ 14 నాడు వారి ఊరి నుండి బయలుదేరి ఈరోజు తేదీ 15 నాడు ఉదయం అందాజ 09:00 గంటల సమయములో హైదరాబాద్ కి వచ్చి, ఉస్మానియా ఆసుపత్రి వద్దకు వెళ్ళగా అక్కడ ఫిర్యాదుదారుడి బావ కుడి కాలు తీసివేయబడి ఉండి, ఎడమ కాలుకి కూడా కూడా రక్త గాయం అయి ఆయన చనిపోయినాడు అని తెలిసింది. ఇట్టి ఆక్సిడెంట్ గురించి విచారించి తెలునుకొనగా ఫిర్యాదుదారుడి బావ ఖిరా సింధు ప్రభోయ్ తేదీ 13 నాడు ఎప్పటిలాగానే టిప్పర్ లారీ టి ఎస్ -07-యూ ఎం -3259 గల దానిపై డ్రైవింగ్ కి వెళ్ళినాడు అని, ఆయనతో పాటు మల్లేశ్ కి చెందిన మరొక టిప్పర్ లారీ . ఏపీ -39-టి టి -5444 పై రాజలింగం అను అతను డ్రైవింగ్ కి వెళ్ళినాడు అని, ఇద్దరు కలిసి వారి వారి టిప్పర్ వాహనాలను తీసుకొని శంషాబాద్ వైపు నుండి షాబాద్ వైపు వెళ్తుండగా, ఆ సమయంలో రాజలింగం నడిపిస్తున్న టిప్పర్ లారీ దీతీ.చీశీ. ఆూా-39-టి టి -5444 ముందు వైపు వెళ్తుండగా, ఫిర్యాదుదారుడి బావ ఖిరా సింధు ప్రభోయ్ నడిపిస్తున్న టిప్పర్ లారీ టి ఎస్ -07-యూ ఎం 3259 దాని వెనకాల వెళ్తూ ఉన్నది అని, వారు షాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో అదే రోజు మద్యాహ్నం అందాజ 03:30 గంటల ప్రాంతంలో నర్కూడ గ్రామపరిధిలోని సబ్-స్టేషన్ కి దగ్గరకి వెళ్ళగానే ఫిర్యాదుదారుడి బావ ఖిరా సింధు ప్రభోయ్ వాహనానికి ముందు వైపు వెళ్తున్న రాజలింగం తన వాహనాన్ని కొంచెం స్లోడౌన్ చేయడంతో, అదే దారిలో వేగంగా వెళ్తున్న ఫిర్యాదుదారుడి బావ ఖిరా సింధు ప్రభోయ్ తన వాహనాన్ని కంట్రోల్ చేయలేక వెనుక వైపు నుండి టిప్పర్ లారీ ఏపీ -39-టి టి -5444 కి టక్కర్ చేశాడు అని, దీంతో ఫిర్యాదుదారుడి యొక్క బావ నడిపిస్తున్న టిప్పర్ లారీ టి ఎస్ -07-యూ ఎం -3259 ముందు వైపు భాగం పూర్తిగా డ్యామేజ్ అయ్యి, డ్రైవింగ్ సీట్లో ఉన్న అతని బావ కుడి కాలు



పూర్తిగా నూజ్జు నూజ్జు అయ్యి, ఎడమ కాలికి బలమైన రక్త గాయం అయినది అని, తరువాత ఫిర్యాదుదారుడి బావ ఖిరా సింధు ప్రభోయ్ ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినారు అని, అక్కడ అతని బావ చికిత్స పొందుతూ ఈరోజు తేదీ 15 న నాడు తెల్లవారుజామున 03:42 గంటలకు చనిపోయినాడు అని డాక్టర్లు నిర్ధారించినారు అని అతని కి తెలిసింది. ఫిర్యాదుదారుడి బావ తాను నడిపించిన టిప్పర్ లారీ టి ఎస్ - 07-యూ ఎం -3259 వాహనాన్ని కొంట్రల్ చేయలేక ముందు వైపు ఉన్న వెళ్తున్న టిప్పర్ లారీ ఎం -39-టి టి -5444 కి టక్కర్ ఇవ్వడంతోనే ఇట్టి ఆక్సిడెంట్ జరిగి, అందులో అతని బావ రక్త గాయాలతో చనిపోయినాడు అని తెలుపుతూ, ఇట్టి విషయం పై ఫిర్యాదుదారుడు పి ఎస్ కి వచ్చి చట్ట రీత్యా చర్య తీసుకోగలరని అని ఆయన తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు ఎప్పుడు ఇస్తారు

**సర్కార్ బడుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం తగదు..**

**కొండాపూర్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మానిక్**

**జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి సిపిఎం నాయకులు వినతి**




సంగారెడ్డి ప్రతినిధి జులై 15( ప్రజా కలం ):

కొండాపూర్ మండల కేంద్రం లోని జడ్పిహెచ్ఎస్ స్కూల్ లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు యూనిఫామ్ తక్షణమే ఇవ్వాలని నేడు సంగారెడ్డి అదనపు కలెక్టర్ గారికి సిపిఎం నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం మాట్లాడుతూ కొండాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈసర్వేలో వచ్చిన సమస్యలు ముఖ్యంగా పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడిచిన విద్యార్థులకు నేటికీ యూనిఫాం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. భవనాలు శిధిలావస్థలో ఉంది భవనం హెచ్చులు ఊడి పడుతుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.. భవనాలు పాడుబడిన గోడలుగా ఉన్నాయి.. సరిపోను మరుగుదొడ్లు లేవు అని ఆవేదన వ్యక్తం చేశారు, విద్యార్థినిలు బయటకు వెళ్లే పరిస్థితి. అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని మండిపడ్డారు, ఉన్న మరుగుదొడ్లు శుభ్రంగా లేవు సరైన ఆట స్థలం ఆట సామాగ్రి లేకపోవడంతో రాష్ట్రస్థాయిలో ఆటలాడే ఉత్తమ విద్యార్థులు ఉన్నప్పటికీ వారికి ప్రోత్సహం అందడం లేదు అని అన్నారు. నైట్ వాచ్మెన్, సీసీ కెమెరాలు లేక దొంగతనాలు అసాంఘిక కార్యక్రమాలు జరిగే పరిస్థితి ఉందన్నారు. జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణంలోనే యుపిఎస్ ప్రైమరీ స్కూల్స్, అంగన్వాడి కేంద్రం, కొనసాగుతున్నాయి. ఈ భవనాలు కూడా పాడువాడిన భవనాలుగా దర్శనమిస్తున్నాయి దీంతో విద్యార్థులు చదువుకోడానికి మంచి వాతావరణం లేకుండా ఉంది.. హాస్టల్ విద్యార్థులు రోజు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు..

కావున కొండాపూర్ మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ మరియు ప్రైమరీ స్కూల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థుల చదువులు మంచి వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు సమస్యలపై వెంటనే జోక్యం చేసుకొని

విద్యార్థులకు తక్షణమే యూనిఫామ్ ఇవ్వాలి, భవనాలకు మరమ్మతులకు పెయింటింగ్ వేయించడానికి వెంటనే బడ్జెట్ కేటాయించాలన్నారు, శిధిల వ్యవస్థలో ఉన్న భవనాలను తొలగించి పునర్నిర్మించాలి, వెంటనే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కారం చేయకుంటే పోరాటానికి తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అశోక్, బాబురావు, సాయిలు, పాల్గొన్నారు

## నాగులమ్మ కుంట ఆక్రమణలపై సమగ్ర సర్వే నిర్వహించి సంరక్షించాలి: గల్వ దయాకర్ రెడ్డి.

దుబ్బాక ప్రజాకలం జూలై 15.

మండల కేంద్రంలోని నాగులమ్మ కుంట రోజురోజుకు ఆక్రమణలకు గురవుతోందని స్థానికుడు గల్వ దయాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు



ఉపయోగపడే చెరువులు, కుంటలు వంటి ప్రజా ఆస్తులను పరిరక్షించడం సంబంధిత అధికారుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. నాగులమ్మ కుంట పరిధిలో జరిగిన ఆక్రమణలపై రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూములను గుర్తించి అక్రమ ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. కుంట అసలు విస్తీర్ణం తగ్గకుండా చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నాగులమ్మ కుంటను సంరక్షించడం అత్యంత అవసరమని, కుంట పరిరక్షణ వల్ల భూగర్భ జలాల పెరుగుదలతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా కాపాడబడుతుందని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశాన్ని అధికారులు అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం: గజ్వేల్ రామచంద్రం

దుబ్బాక ప్రజాకలం జూలై 15.

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని సామాజిక కార్యకర్త గజ్వేల్ రామచంద్రం అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ కోసం సంబంధిత బీఎల్ఓలు పద్మ, మంజులకు దరఖాస్తు ఫారాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా, సమాజం పట్ల బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, అందరూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. “మన ఓటు -- మన హక్కు, మన బాధ్యత” అనే సందేశంతో ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలని గజ్వేల్ రామచంద్రం పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి, ప్రతినిధి జూలై 15(ప్రజా కలం ): జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం(ఎస్ఐఆర్)ను విజయవంతంగా నిర్వహించి, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని వివరించి, రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన ఏర్పడిందని, అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తయ్యిందన్నారు. ఇప్పటివరకు సగటున 55 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తైందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా నారాయణఖేడ్‌లో 73 శాతం, ఆందోల్‌లో 65 శాతం, జహీరాబాద్‌లో 61 శాతం,




సంగారెడ్డిలో 54 శాతం, పటాన్‌చెరులో 35 శాతం డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. నిర్ణీత సమయంలో గా జిల్లాలో డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తిచేసే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడంతో పాటు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లను చైతన్యపరిచి బి ఎల్ వో లకు సహకరించేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేటీఆర్ పాదయాత్ర పోస్ట్ పోన్..?

హైదరాబాద్ : తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ ఏడాది నుంచే ఆ పాదయాత్ర ప్రారంభం కావాల్సి ఉంది. దీనిపై కేటీఆర్ .. పార్టీలోనూ.. తన కుటుంబంలోనూ చర్చించినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. రాజకీయంగా పాదయాత్ర ఏమేరకు తమకు దోహదపడుతుందన్న విషయంపైనా ఆయన ఆరా తీశారు. అధికారంలోకి వచ్చేందుకు ఇది ఎంతవరకు ఉపయోగపడుతుందన్నది కూడా తెలుసుకున్నారు. పాదయాత్ర చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు చేరువ కావడం ఒక భాగమైతే.. మరోవైపు పార్టీని డెవలప్ చేసుకోవడం మరో లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలోనే పాదయాత్రకు కేటీఆర్ తొలిసారి ప్రాధాన్యం ఇస్తున్నారన్న చర్చ కూడా ఉంది. మరోవైపు కేసీఆర్ సైతం బస్సు యాత్ర చేస్తారని పార్టీ వర్గాలు ప్రకటించాయి. దీనిని కేటీఆర్ కూడా ఔననే చెప్పారు. సో.. అటు కేటీఆర్, ఇటు కేసీఆర్ ఏకకాలంలో ప్రజలను కలుసుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చి.. తద్వారా మరోసారి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేయడం ఖాయమన్న బీఆర్ఎస్ వర్గాల మాట. అయితే? ఇప్పుడు రెండు యాత్రలు కూడా వాయిదా పడ్డాయని తెలుస్తోంది. ఈ ఏడాదే పాదయాత్ర ప్రారంభిస్తానని కేటీఆర్ చెప్పినప్పటికీ.. ప్రజల్లో ఆమేరకు అవసరమైన రాజకీయ పరిస్థితి కనిపించడం లేదని దీంతో ఇప్పుడు పాదయాత్ర చేసినా విఫల ప్రయత్నమే అవుతుందన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజల్లో ఎక్కడా మోహం మొత్తలేదు.